ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 8 జూన్ 2025

చదువుతో సామాజిక స్థితి మార్పు

● హోదా ముందు.. కుల వివక్ష నిలబడదు

● 11 సంవత్సరాలుగా విద్యార్థులకు అండగా పినాక సంస్థ

● ఇన్‌కంటాక్స్ కమిషనర్ బి.యాదగిరి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): "హోదా ముందు కులాలు.. మతాలు పనిచేయవు.. కులవివక్ష నిలబడలేదు. ఎవరి సామాజిక స్థితినైనా మార్చగలిగేది చదువు ఒక్కటే.. మన ప్రాంతానికి చెందిన గ్రామీణ విద్యార్థులు చదువులో, సబ్జెక్టులో ఎంతో పరిజ్ఞానం ఉన్నా... ఇంగ్లీషు మాట్లాడటంలో ఇబ్బంది ఉండడంతో మల్టీ నేషనల్ కంపెనీలలో ఇంటర్వ్యూలలో నెగ్గలేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా అవకాశాలు పొందాలనే పినాక అనే సంస్థను ప్రారంభించాము. 11 సంవత్సరాలుగా వేలాది మందికి స్పోకెన్ ఇంగ్లీషు, పర్సనాలిటీ డెవలప్‌మెంటు, కమ్యూనికేషన్ స్కిల్స్‌లలో ఉచిత శిక్షణ ఇస్తున్నాం" అని పినాక సంస్థ వ్యవస్థాపకులు, హైదరాబాదులో ఇన్‌కంట్యాక్స్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.యాదగిరి తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని పుంగనూరు నియోజకవర్గం పులిచెర్లకు చెందిన ఆయన తన ఉద్యోగ ప్రస్థానం, పినాక సంస్థ కార్యక్రమాలపై ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

వ్యవసాయ కుటుంబం

అమ్మానాన్నది వ్యవసాయ కుటుంబం. మాది పులిచెర్ల మండలం కురవపల్లె.. 70 కుటుంబాలు ఉన్న చిన్న పల్లెటూరు. 5 వ తరగతి వరకు అక్కడే చదివాను. 6 నుంచి 10 వరకు పులిచెర్లలో చదివాను. ఇంటర్మీడియట్ పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాను. తిరుపతి ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ, ఎస్వీ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాను.

పినాక ఎలా ప్రారంభమైందంటే..

1999లో కేవీపల్లె ఎంపీడీవోగా పనిచేసే సమయం నుంచే.. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు, చదువు కోసం నా సంపాదనలో 10 శాతం ఖర్చు చేసేవాడిని. విద్యార్థులు, నిరుద్యోగులకు కెరీర్‌పరంగా సలహాలు ఇచ్చే వాడిని.. 2008లో నేను హైదరాబాదులో ఇన్‌కంట్యాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసేటపుడు సదుం మండలం నుంచి ఒక అబ్బాయి వచ్చి ఎంసీఏ చదువుతున్న తనకు కాలేజి ఫీజులో రాయితీ ఇప్పించమని అడిగాడు. 50 శాతం ఫీజులో రాయితీ ఇప్పించాము. ఎంసీఏ 75 శాతం మార్కులతో పాసైన అతను ఇంగ్లీషు మాట్లాడడంలో ఇబ్బంది వల్ల ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరైనా ఉద్యోగం పొందలేకపోయాడు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంసీఏ, ఎంబీఏలు చదివినా ఇంగ్లీషు రాకపోవడం వల్ల.. ఉద్యోగాలు పొందలేకున్నారు.. వీళ్లకు ఇంగ్లీషు నేర్పించడానికి ఏదైనా చేయాలి... వేసవిలో పిల్లలను ఒకచోట చేర్చి ఇంగ్లీషు ఎందుకు నేర్పించకూడదు.. అనుకున్నా.. 2012 మకర సంక్రాంతి రోజు పలమనేరుకు వెళ్లి మా కులానికి చెందిన ఐదారు గురు కులపెద్దలను కలిశాను.. అందరూ కలిసి చేద్దామని చెప్పారు. అలా పుట్టిందే పినాక సంస్థ.

ఎంపీడీవో నుంచి ఐఆర్ఎస్ దాకా..

డిగ్రీ చదివేటప్పుడు నేను ఒకసారి బస్సులో ప్రయాణం చేస్తున్నా.. సివిల్ సర్వీసులు రాస్తే పైస్థాయికి వెళ్లవచ్చు అని.. పక్క సీట్లో ఎవరో మాట్లాడుకుంటున్నారు.. అది విని ఎక్కువ ఆలోచించాను. పీజీ పూర్తి కాగానే.. సివిల్స్ కోసం హైదరాబాదుకు వెళ్లాను. సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ ఉండగానే.. మధ్యలో ఎంపీడీవో ఉద్యోగం వచ్చింది. మొదటి పోస్టింగ్ కేవీపల్లె. ఇంకా పెద్ద ఉద్యోగం సాధించాలనే ఆలోచన ఉండేది. 2002లో ఒక సంవత్సరం లాంగ్ లీవ్ పెట్టి.. ఢిల్లీకి వెళ్లాను. రోజుకు 13 గంటల పాటు చదివాను. పరీక్ష రాశాను. 2003లో ఐఆర్ఎస్ వచ్చింది.

మూడు కేంద్రాలలో మొదలు

2012 మే నెలలో పలమనేరు, మదనపల్లె, పీలేరులో మొదటిసారిగా కేవలం కురవ కులానికి చెందిన నిరుద్యోగులు, విద్యార్థుల కోసమే ఉచిత శిక్షణ తరగతులు మొదలుపెట్టాము. సంస్థ తరఫున జీతం ఇచ్చి.. ఇంగ్లీషు ఫ్యాకల్టీని నియమించి స్పోకెన్ ఇంగ్లీషులో 21 రోజులపాటు శిక్షణ ఇచ్చాము. కార్పొరేట్ ట్రైనర్ రాజారాం జత కలిశారు. దీంతో శిక్షణా తరగతుల్లో అనేక మార్పులు చేపట్టాము. 2013 నుంచి స్పోకెన్ ఇంగ్లీషు తరగతులే కాకుండా.. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాలను చెప్పాము. 2015 నుంచి అందరికీ ఉచిత కోచింగ్ ప్రారంభించాము. 2015లో కర్నూలు, అనంతపురంలో, 2018లో రాయచోటి, 2025లో ధర్మవరంలో కొత్తగా శిక్షణ కేంద్రాలు ప్రారంభించాము. వచ్చే సంవత్సరం నంద్యాల, ప్రొద్దుటూరు, నెల్లూరులో మొదలు పెట్టాలి అనుకుంటున్నాము. 2015 నుంచి మేమే స్పోకెన్ ఇంగ్లీషు మెటీరియల్ తయారు చేసి విద్యార్థులకు అందిస్తున్నాము.

21 రోజులు తరగతులు

వేసవిలో మొత్తం 21 రోజులు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నాం. నేనే స్వయంగా రెండు రోజులు పూర్తిగా లైఫ్ స్కిల్స్ తరగతులు చెబుతున్నా. డిబేట్లు, ఇంటర్వ్యూలు ఎలా అటెండ్ కావాలో నేర్పిస్తున్నాము. చదువు, ఉద్యోగాలే కాకుండా వ్యాపారమైనా ఎలా విజయం సాధించాలో నేర్పిస్తున్నాము. కోర్సు అయిపోయిన తర్వాత కూడా మాతో సంప్రదిస్తే అవకాశాలు ఉన్నచోట ఉద్యోగాలు చూపిస్తున్నాము. మా దగ్గర కోర్సు చేసిన వాళ్లు.. ఇప్పుడు అన్ని ముఖ్య పట్టణాల్లో.. అన్ని రంగాలలోనూ ఉన్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే వారికి నేను మెంటార్‌షిప్ చేస్తాను.

వేల మందికి ఉద్యోగాలు

శివుడి విల్లు పేరు పినాక. దీనిని సుదూర లక్ష్యాలను ఛేదించడానికే ఉపయోగించేవాడని ఇతిహాసంలో చదివాను. మన పిల్లలు కూడా ఉన్నత లక్ష్యాలను ఛేదించడానికి పినాక ఒక లాంచ్‌ప్యాడ్ లాగా పనిచేస్తుంది. మా వద్ద శిక్షణ పొందిన అనేక మంది పేద విద్యార్థులు డిప్యూటీ కమిషనర్లు, ఎంపీడీవోలు అయ్యారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చాలా మందికి వచ్చాయి. రిలయన్స్‌లో రీజనల్ ఇన్‌చార్జ్‌గా సౌత్ ఇండియా స్థాయిలో పనిచేస్తున్న వాళ్లు ఉన్నారు. కొన్ని వేల మంది జీవితాలు స్థిరపడ్డాయి. చిన్న ఉదాహరణ.. అనంతపురం జిల్లా కంబదూరు అనే మండలంలో సచివాలయ వ్యవస్థలో 90 మంది పనిచేస్తున్నారు. బ్యాంకు మేనేజర్లు 15 మంది ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ.. ఇద్దరు ముగ్గురు గ్రూపు-1 స్థాయిలో ఉన్నారు.

ఆరు వేల మందికి శిక్షణ...

కరోనా సమయంలో రెండు సంవత్సరాలు, గత ఏడాది ఎన్నికల సమయంలో మాత్రం తరగతులు నిర్వహించలేకపోయాము. ఇప్పటి వరకు 11 సంవత్సరాలు తరగతులు నిర్వహించాము. 2024 వరకు 6 వేల మందికి ఉచిత శిక్షణ ఇచ్చాము. రాబోయే రోజుల్లో ఇంకా చాలామంది విద్యార్థులకు ఉపయోగపడాలి. తిరుపతిలో పినాక భవన్ నిర్మించాలి. ప్రతి పోటీ పరీక్షకు ఉపయోగపడేలా అన్ని పరీక్షలకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇవ్వాలి. మధ్యాహ్న భోజనంతో సహా పూర్తి ఉచితంగా ఇవ్వాలి అనేది లక్ష్యం. పినాక భవన్ పనులు 2027లో మొదలు పెట్టాలి అనుకుంటున్నా.. గ్రామీణ విద్యార్థులు, అర్బన్ విద్యార్థులతో పోటాపోటీగా పోటీ పరీక్షల్లో తలపడే విధంగా చేయాలన్నది లక్ష్యం.. ఎప్పుడూ ఉన్నత లక్ష్యాలే ఉండాలి.. చిన్న లక్ష్యాలు ఉండకూడదు.



విద్యార్థులకు బోధిస్తున్న యాదగిరి

Sunday Special

రెండోరోజు కార్మికుల సమ్మె



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషర్ ప్రమీల

● కార్మికులతో మాట్లాడిన కమిషనర్

మదనపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వంతో చర్చలు జరిపారు. చర్చలు విఫలం కావడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీరంతా సమ్మెలో భాగంగా నిరసన చేపడుతున్నారు. కమిషనర్ కె.ప్రమీల శనివారం సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఎక్కడా చేయలేదని, మీరు మాత్రమే ఇక్కడ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సమ్మెను విరమించాలని కార్మికులను కోరారు. యూనియన్ నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారు కమిషనర్‌కు తెలిపారు. కార్మికులు గోపాలకృష్ణ, నాగరాజ, కన్నయ్య, శ్రీనివాసులు, ఎస్.కె.రెడ్డెప్ప, శాంతిపురం నాగరాజ, నారాయణ, మహేష్, బాబు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు ఏపీ సేవా పోర్టల్ బంద్!

● ముఖ్యమైన పది రకాల సేవలకు అంతరాయం

కలికిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల శాఖల ఆధ్వర్యంలో ఉన్న ఏపీ సేవా పోర్టల్ నాలుగు రోజుల పాటు బంద్ అయింది. శనివారం ఉదయం నుంచి మంగళవారం రాత్రి వరకు ఈ పోర్టల్ ద్వారా అందజేస్తున్న సేవలు నాలుగు రోజుల పాటు తాత్కాలింగా నిలిచిపోనున్నట్లు రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ కార్యాలయం ప్రకటించింది. ఈ నాలుగు రోజులు కొన్ని సేవలకు పూర్తి అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నడుస్తున్న మైక్రోసాఫ్ట్ అజ్యూర్ క్లౌడ్ నుంచి ఈ పోర్టల్‌ను ఏపీ రాష్ట్ర డాటా కేంద్రానికి తరలిస్తున్న (మైగ్రేషన్) కారణంగా కొన్ని సేవలకు తాత్కాలిక అంతరాయం తప్పడం లేదని తెలిపింది. ఫలితంగా ముఖ్యమైన ఆదాయ ధృవీకరణ పత్రాలు, సమగ్ర ధృవీకరణ పత్రాలు (ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్), భూముల మ్యుటేషన్‌లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల పట్టాలు, వృద్ధాప్య ధృవీకరణ పత్రాలు, వివాహ ధృవీకరణ పత్రాలు, రెవెన్యూ నీటి తీరువా పన్నులు, పట్టణ పరిపాలనకు సంబంధించిన సేవలు, మత్స్య శాఖకు చెందిన సేవలు ఈ నాలుగు రోజులు అందుబాటులో ఉండవని వివరించారు. ఈ పది రకాల సేవల మినహా మిగిలిన ఇతరత్రా పభుత్వ సేవలు మాత్రం అందుబాటులో వుంటాయని పేర్కొన్నారు. ఈ సేవల కోసం ప్రయత్నించే వారందరూ దీన్ని గుర్తించి సహకరించాలని రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ కోరారు.

సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం : మంత్రి



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడిక్కడే పరిష్కరిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాయచోటి నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. జిల్లాలో ఎక్కువగా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలు మీద అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

హార్సిలీహిల్స్‌లో

ఏడు విద్యుత్ కనెక్షన్‌లు కట్

బి.కొత్తకోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొండపై ఏకంగా ఏడు విద్యుత్ కనెక్షన్‌లను కట్ చేశారు. ఈ విషయం చర్చనీయాంశమైంది. కొండపై చిన్న నిర్మాణం జరగాలన్నా సబ్‌కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే హార్సిలీహిల్స్ టౌన్ షిప్ కమిటీ అనుమతులు తప్పనిసరి. అయితే గత వైసీపీ హయాంలో అందులోనా కరోనా పీడిత సమయంలో కొందరు అదనుగా భావించి అనుమతులు లేకున్నా పని కానిచ్చేశారు. తాజాగా సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేశారు.

నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలకు చెందిన ఏడు విద్యుత్ కనెక్షన్‌లను తొలగించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులకు వినియోగదారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. టౌన్‌షిప్ కమిటీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న విద్యుత్ సర్వీసులను తొలగించాలన్న ఆదేశాల మేరకే విచారణ చేసి అక్రమ సర్వీసులను తొలగించామని విద్యుత్‌శాఖ సిబ్బంది పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ

● ఈద్గాహ్‌లలో పండుగ నమాజు ఆచరించిన ముస్లింలు




మదనపల్లెలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పీలేరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పీలేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మహోన్నత త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ముస్లింలందరూ ఉదయం 8 గంటలకు ఈద్గాలకు చేరుకుని అక్కడ సామూహిక ప్రార్థనలు చేశారు. పీలేరులో మదనపల్లె మార్గంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజంపేటలోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదనపల్లె జామియా మసీదు నుంచి ముస్లింలు బెంగళూరు రోడ్డులోని ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతగురువు బక్రీద్ పండుగ గురించి వివరించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాయచోటి పట్టణంలోని పాతరాయచోటి సమీపంలో గల హజరత్ జమాలుల్లా ఈద్గాలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.

టీడీపీకి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా 6



● చంద్రబాబుకు లేఖ

బకాయిలు భరించలేం..

» అద్దెలు చెల్లించండి..

» సచివాలయ భవన యజమానుల వేడుకోలు 6

నిర్లక్ష్యం నీడలో..చరిత్ర సాక్ష్యం

● ముళ్ల పొదల్లో భోగంరాణి బావి ● నవాబుల పాలనలో నిర్మాణం

● ఆదరణకు నోచుకోని అందమైన కట్టడం 6

రైతు సంక్షేమమే ధ్యేయం

● డీసీసీబీ, డీసీఎంఎస్‌ల ద్వారా పారదర్శక సేవలు

● కష్టపడే వారందరికి పదవులు

● డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారోత్సంలో కూటమి నేతలు

● డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి




డీసీసీబీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మంచూరు సూర్యనారాయణరెడ్డి




డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎర్రగుండ్ల జయప్రకాశ్

కడప రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు తెలిపారు. శనివారం కడప నగరం ఊటుకూరులోని ఓ కన్వెన్షన్ హాలులో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ముందుగా డీసీసీబీ చైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణ రెడ్డి అనంతరం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎర్రగుండ్ల జయప్రకాశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీని జిల్లాలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు వస్తాయనడానికి సూర్యనారాయణరెడ్డి, జయప్రకాశ్‌లే నిదర్శనమన్నారు. మరో ఆరు నెలల్లో డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికలు రాబోతున్నాయని వీటిలో ఘనవిజయం సాధించేలా ముందుకు సాగాలన్నారు. డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి వీరారెడ్డి నాయకత్వంలో ఒక కార్యకర్తగా తన రాజకీయ జీవితం ప్రారంభమైందన్నారు. చైర్మన్‌గా తాను పారదర్శక సేవలు అందిస్తానన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్ మాట్లాడుతూ సేవలన్నింటిని పారదర్శకంగా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల బీజేపీ అధ్యక్షులు సాయిలోకేశ్, వెంకటసుబ్బారెడ్డి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు భూపేశ్‌రెడ్డి, రితీశ్‌రెడ్డి ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టీడీపీ నేత ఉక్కు ప్రవీణ్, హరిప్రసాద్ తదితరులు మాట్లాడారు. డీసీఈవో సురేశ్, డీసీసీ బ్యాంకు సీఈవో రాజామణి, డీసీఎంఎస్ జిల్లా అధికారి ఖాదర్‌బాషా, పలువురు టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చే క్రమంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వార్డు, గ్రామ సచివాలయాలను పలు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అప్పట్లో కొన్ని సచివాలయాలకు భవనాలు నిర్మించినా, మరికొన్నింటి నిర్మాణాలు వివిధ కారణాలతో అర్ధాంతరంగా ఆగిపోయాయి.





ప్రశాంత్‌నగర్, నీరుగట్టువారి పల్లెలో సచివాలయాలు నిర్వహిస్తున్న అద్దె భవనాలు

బకాయిలు భరించలేం..

- అద్దెలు చెల్లించండి.. మహాప్రభో..!
- సచివాలయ భవన యజమానుల వేడుకోలు
- జిల్లాలో రూ.80 లక్షల మేర బకాయిలు

మదనపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాలతోపాటు, పట్టణ శివారు పంచాయతీలోని గ్రామాల్లో గ్రామ సచివాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా భవనాలకు సంబంధించిన అద్దెలు ప్రభుత్వం నెలనెలా సక్రమంగా చెల్లించక పోవడంతో భవన యజమా నులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకూ ఏడు నెలలు పూర్తి కాగా, ఎనిమిదో నెల కూడా ముగు స్తున్నా.. బాడుగ డబ్బులు రాకపోవడంతో కొందరు యజమానులు సచివాలయాలకు తాళం వేయడానికి సిద్ధమవుతున్నారు. రావాల్సిన డబ్బులు వచ్చినప్పుడు తీసుకుంటామని, ఆఫీసులు మాత్రం వెంటనే ఖాళీ చేయండని సచివాలయ ఉద్యోగులను ఆదేశిస్తున్నారు. మరికొందరేమో.. ఇప్పటి వరకూ రావాల్సిన బకాయిలు చెల్లించి టేబుల్, కుర్చీలు సర్దుకోండని సూచిస్తున్నారు. నాలుగేళ్లుగా అద్దెలు పెంచలేదని, అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఒకే మొత్తాన్ని చెల్లిస్తుండడం కూడా వారి ఆక్రోశం, ఆవేశానికి కారణంగా చెప్పవచ్చు. మున్సిపాలిటీ గదులు అయితే మాత్రం.. మూడేళ్లకో సారి రెన్యువల్ చేయడంతోపాటు 33 శాతం అద్దె పెంచి వసూలు చేస్తున్నారు కదా అని ప్రశ్నిస్తున్నారు. పైగా వ్యాపారులు, ఇతర వర్గాలు తీసుకున్న గదులకు ఏ నెలకు ఆ నెల బాడుగ చెల్లించకుంటే సర్వీస్ చార్జీలతోపాటు, అపరాధ రుసుం వసూలు చేస్తున్నా రని, అది కూడా నెలలో అయిదో తేదీ లోపల చెల్లించకుంటే వడ్డీ వసూలు చేస్తున్నారంటున్నారు. ఇదే విషయాన్ని నిన్నటి మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యులు ప్రస్తావించారు. ఇలా ఎన్నిరోజులైనా ఎలా ఉంటారని ప్రశ్నించారు. జిల్లాలో మొత్తం 501 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 414, పట్టణ ప్రాంతాల్లో 87 సచివాలయాలుండగా, వీటిలో 82 గ్రామ, వార్డు సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటికి చదరపు గజం రూ.6 నుంచి రూ.10 చొప్పున భవనం విస్తీర్ణాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.15వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు బాడుగలు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు లేదా నాలుగు నెలలకోసారి, అది కూడా ఒక నెల మాత్రం చెల్లించి మిగిలిన మొత్తం బకాయి పెట్టింది. అదే ప్రవేటు వ్యక్తులకు బాడుగకు ఇస్తే.. అడ్వాన్సుతో పాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా అద్దె వచ్చేదని యజమానులు వాపోతున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా తీసుకుంటే ఎనిమిది నెలలుగా బాడుగలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.80 లక్షల మేర బకాయి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో 44 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో 23 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3 లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకూ ఏడు నెలలు పూర్తయి, మరో నెల కూడా ఆ జాబితాలో చేరనుంది. జిల్లా కేంద్రం రాయచోటిలో 25 వార్డు సచివాలయాలు ఉండగా, 22 కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి. రూ.12లక్షల మేర బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో 13 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో ఏడు సచివాలయాలు బాడుగ భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే జిల్లాలోని 30 మండలాల్లో మదనపల్లె డివిజన్‌లో ఏడు, రాయచోటి డివిజన్‌లో ఆరు, రాజంపేట డివిజన్‌లో పదిహేను చొప్పున మొత్తం 28 గ్రామ సచివాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. కాగా, సచివాలయ భవనాల అద్దెలను ఆయా భవనాల యజమానుల పేరున సీఎఫ్ఎంఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే, వారివారి ఖాతాలకు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం నీడలో.. చరిత్ర సాక్ష్యం



- ముళ్ల పొదల్లో భోగంరాణి బావి
- ఆదరణకు నోచుకోని అందమైన కట్టడం
- నవాబుల పాలనలో నిర్మాణం
- అభివృద్ధి చేస్తే పర్యాటకానికి ప్రోత్సాహం
- పట్టించుకోని పురావస్తు శాఖ

పాలకుల నిర్లక్ష్యం కారణంగా చరిత్రను కళ్ల ముందుంచే ప్రాచీనమైన కట్టడాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయనడానికి సిద్దవటం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భోగంరాణి బావి నిదర్శనంగా నిలుస్తోంది. శతాబ్దాలుగా ఆదరణ లేకపోవడంతో అతి సుందరమైన ఈ కట్టడం క్రమేణా శిథిలమైపోతోంది

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మట్లిరాజులు, సూర్యవంశ రాజులు పరిపాలించిన సిద్దవటం మండల కేంద్రానికి సమీపంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల మధ్యలో భోగంరాణి బావి అనే కట్టడం ఉంది. అప్పట్లో పాలకులు ఈ కట్టడాన్ని విడిదిగా వినియోగించేవారు. సిద్దవటం కోటను హకీంఖాన్ అనే వ్యక్తి పాలించే కాలంలో ఆయనకు ఒక ఉంపుడుగత్తె ఉండేది. తనకోసం ఒక సుందరమైన భవనాన్ని నిర్మించాలని ఆమె రాజును కోరగా, ఆయన సమ్మతించాడు. ఆమె కోరిక ప్రకారం భవనాన్ని నిర్మించాలంటే ఖర్చు చాలా అవుతుందని అప్పటి వడ్డెరలు హకీంఖాన్‌కు తెలపగా, ఆ మొత్తం ఆమే చెల్లిస్తుందని, పనులు ప్రారంభించమని ఆదేశించాడు. దీంతో ఒక తూముడు బంగారు నాణేలు ఇచ్చే ఒప్పందంపై వారు భవనాలను, బావిని నిర్మించారు. పనులు పూర్తయ్యాక తమకు ఇస్తామని చెప్పిన బంగారు నాణేలు ఇవ్వాలని వడ్డెరలు అడగగా, ఆమె ఒక గొడ్డలి తెచ్చి కట్టె తీసివేసి గొడ్డలికి ఉన్న రంధ్రం నిండుగా బంగారు నాణేలు వేసి తీసుకోమన్నదట. ఇది చాలా అన్యాయమని వడ్డెరలు ఆమెతో గొడవకు దిగినా ఆమె లెక్కచేయలేదట. దీంతో కోపగించిన వడ్డెరలు భవనం మధ్యలో బావిపై నిర్మించిన ఉయ్యాల ఊగుతూ, బావిలో పడి చస్తావని శాపం పెట్టారు. ఆ ప్రకారమే ఆమె ఒకరోజు ఉయ్యాలలో ఊగుతూ, బావిలో పడి మరణించిందట. అప్పటి నుంచి ఆ భవన సముదాయానికి భోగం రాణి బావి అని పేరు వచ్చింది. ఆమె కూడబెట్టిన సొమ్ము అంతా ఒక పెట్టెలో ఉంచి ఆ బావిలోనే దాచినట్లు ప్రచారం ఉంది. అత్యంత సుందరంగా నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పూడిపోయింది. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కొంతభాగం పైకప్పు ఉన్నా చాలావరకు మొండి గోడలే మిగిలిపోయాయి. ఎంత శిథిలమైనా ఇప్పటికీ చాలా అందంగా కనిపిస్తుందని స్థానికులు చెబుతుంటారు.

ఇప్పటికైనా పాలకులు, పర్యాటక శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న కట్టడాన్ని పరిరక్షించడంతోపాటు అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటు లోకి తేవాలని మండలవాసులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



పురావస్తుశాఖ అధికారులు స్పందించి భోగంరాణి బావిని అభివృద్ధి బాటలోకి తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే, పర్యాటకులను ఆకట్టుకునే అవకాశం ఉంది.

- నాగార్జున, ఎస్.రాజంపేట

పర్యాటకరంగానికి ఊతం



భోగంరాణి బావిని అభివృద్ధి చేసి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలి. దీంతో పర్యాటక రంగం ఊతం లభించడంతోపాటు, ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం కూడా వస్తుంది.

- సహదేవ్, ఎస్.రాజంపేట

నాటుసారా స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

వాల్మీకిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరితోపాటు, వారికి సరఫరా చేస్తున్న మరో వ్యక్తి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో స్థానిక సీఐ లత, ఎస్ఐ సుభాషిణి సిబ్బంది శనివారం వాల్మీకిపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న గుండ్లూరు గ్రామానికి చెందిన అల్తాఫ్‌బాషా (31), కిరణ్ కుమార్ (28)ను అరెస్టు చేసి వారి నుంచి 14 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసు కున్నారు. వీరికి నాటుసారా సరఫరా చేసిన క్రాంతి అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని ముగ్గురినీ రిమాండుకు తరలించారు.

అతిగా మద్యం తాగి యువకుడు మృతి



మృతి చెందిన యువకుడు

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ఓ యువకుడు మృతిచెందాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని యువకుడు మద్యం తాగి పుంగనూరు రోడ్డు పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని అరుగుపై పడుకున్నాడు. శనివారం తెల్లవారే సరికి అతను అరుగుపై నుంచి కింద పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అతను పాతసామాన్లు ఏరుకుని గుజిరీకి విక్రయించి జీవిస్తుంటాడని గుర్తించారు. మృతుని వివరాలు తెలిస్తే స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ వెంకరటమణ ఒక ప్రకటనలో తెలిపారు.

కారు బోల్తా - ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన కారు

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కారు బోల్తా పడడంతో ముగ్గురికి గాయా లయ్యాయి. నందలూరుకు చెందిన కొందరు శనివారం ఉదయం అనంతపురం నుంచి వస్తుండగా కడప - చెన్నై జాతీయ రహదారిలోని నిర్మలగిరి కాలనీ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయా ణిస్తున్న రామకృష్ణయ్య, కల్యాణి, ప్రశాంతి గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ప్రమాద సమయంలో కారులు ఐదుగురు పెద్దలు, నలుగురు పిల్లలు ఉన్నట్టు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. ఈ ప్రమాదంలో పెంచలయ్యకు చెందిన దుకాణం పాక్షికంగా దెబ్బతినింది.

ఆటో బోల్తా.. తొమ్మిది మందికి గాయాలు

మదనపల్లె టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో తొమ్మిది మంది గాయపడ్డారు. మండలంలోని తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్ శనివారం తన షేర్ ఆటోలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని ఆరోగ్యవరం బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఎర్రగన్నమిట్ట డౌన్‌లో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే యత్నంలో అదుపు చేయలేకపోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చంద్రశేఖర్, షాహీనా (30), హమీదా(35), మస్తాని(40), నాదిర్‌షా(25), యూసఫ్(5), ఆసియా(3), రుఖియా (13), మరియా(12) గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స చేయించుకుని బాధితులు ఇళ్లకు వెళ్లిపోయారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీకి చెందిన రామకృష్ణ కుమారుడు గంగాధర్(24) భవన నిర్మాణ కార్మికుడు. మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతో వివాహ సంబంధాలు రాలేదు. ఆరోగ్యం కుదుట పడ్డాక వివాహం చేస్తామని తల్లిదండ్రులు కూడా చెప్పడంతో మనస్తాపం చెంది విషం తాగాడు. కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన నరసింహులు భార్య ఎల్లమ్మ(65) ఆరేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతోంది, ఇటీవల అనారోగ్యం ఎక్కువ కావడంతో గన్నేరు కాయలు తినింది. మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

కనులపండువగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన భక్తులు

ములకలచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపూరికోట సమీపంలో శనివారం చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేపూరికోట, కుటాగుల్లోళ్లపల్లె, పెద్దయ్యగారిపల్లె, వేపూరికోట క్రాస్, గురికివారిపల్లె, చీకుచెట్టుపల్లె, ఆర్ఎస్ కొత్తపల్లె, ఎర్రకాలువపల్లె, ఉమాశంకర్‌కాలనీ, ఆవులవారిపల్లె, ఎద్దులవారిపల్లె, పెద్దపల్లె, బంగారువాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, ఎస్సీ కాలనీల నుంచి భక్తులు తరలి వచ్చారు. పెళ్ళి పెద్దలుగా నవీన్‌కుమార్, స్వర్ణ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విద్యుత్‌దీపాలంకరణ, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధారెడ్డి, మాజీ ధర్మకర్త రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, లక్ష్మన్న, మూగి రవిచంద్ర, వేమారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటాద్రి, శేషారెడ్డి, పిడుగు రెడ్డెప్ప, భాస్కర్‌రెడ్డి, అశోక్ కుమార్, పుల్లారెడ్డి, చలపతి, జయరాంరెడ్డి, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అటవీ సంపద కొల్లకొట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం మాట్లాడుతూ ఉద్యమకారులను కేంద్ర ప్రభుత్వం అణగదొక్కడం దారుణమన్నారు. వ్యక్తులను అంతం చేసినంత మాత్రాన ఉద్యమాలు అంతం కావన్నారు. బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ కగార్‌పై హోంమంత్రి ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. పేద, బడుగులకు చేదోడుగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల కోసం పోరాడుతున్న వ్యక్తులను అంతం చేయడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను కూడా వారి బంధువులకు అప్పగించలేదన్నారు. ఈ సమావేశంలో ఏపీసీఎల్సీ నాయకుడు నాగేశ్వరరావు, న్యాయవాది సోమశేఖర్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి పాల్గొన్నారు.

తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా భవ్యశ్రీ



కుటుంబ సభ్యులతో భవ్యశ్రీ

కడప రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కడపకు చెందిన యువతి అతి పిన్న వయసులోనే తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక య్యారు. త్వరలో న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

తండ్రి ప్రోత్సాహంతో..

కడప నగరంలో నివాసం ఉంటున్న పసుపులేటి చంద్ర, మాధురీదేవి కుమార్తె భవ్యశ్రీ. పసుపులేటి చంద్ర ప్రస్తుతం అట్లూరు పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా తరచూ కోర్టుకు వెళ్లేవారు. ఆ సమయంలోనే తమ బిడ్డను న్యాయమూర్తిగా చూడాలనుకున్నారు. అందు లో భాగంగా భవ్యశ్రీకి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో క్లాట్ శిక్షణ ఇప్పించారు. ఇంటర్మీడియట్ పూర్తి కాగానే వైజాగ్‌లోని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీలో ఐదేళ్ల లా కోర్సులో చేర్పించారు. కోర్సు పూర్తయిన తరువాత 2023లో తెలంగాణ హైకోర్టులోను, 2024లో ఏపీ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2024లో తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలోను చక్కని ప్రతిభ చూపి 24 ఏళ్ల వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు.

న్యాయం వైపు నిలబడ్డమే ప్రధాన విధి

న్యాయం వైపు నిలవడమే ప్రధాన విధిగా భావిస్తా. తండ్రి కోరిక మేరకు లా చదివి జడ్జిని అయ్యాను. లా కాలేజీలో మంచి ఫౌండేషన్ ఏర్పడింది. జూనియర్ సివిల్ జడ్జి నోటిఫికేషన్ పడినప్పటి నుంచి సాధన చేశాను. సీనియర్ జడ్జిల సెమినార్లకు హాజరు కావడంతో పాటు, కోర్టుకు వెళుతూనే, ఎలాంటి కోచింగ్ లేకుండా రోజుకు 8 నుంచి 12 గంటలు శ్రమించాను. తొలి ప్రయత్నంలోనే జడ్జిగా ఎంపికయ్యా. చట్టాలకు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులకు లోబడి, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తా.

- పసుపులేటి భవ్యశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గాలివీడు, జూన్7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బాధ తాళలేక ఓ వ్యక్తి విషం తాగి న వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు... గోరాన్‌చెరువు గ్రామం మండివాండ్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన నచ్చుకూరి లక్ష్మయ్య (59)కు పదే పదే మూర్ఛ వ్యాధి వస్తుండటంతో మనస్తాపం చెందేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది జూన్ 1వ తేదీ పింఛన్ డబ్బులు తీసుకున్నాడు. సాయంత్రం 6 గంటల సమయంలో పొలం దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద స్పృహ తప్పిపడిపోయి కనిపించాడు. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ లక్ష్మయ్య శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పూజారికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుళారం చిన్నరాసిపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటి మాసా పేట గంగమ్మ దేవాలయ పూజారి చెంద్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం కాకుళారం గ్రామానికి వెళ్లి వస్తుండగా కొత్తరాసిపల్లె వద్ద స్కూటర్ ఢీకొని కింద పడ్డారు. దీంతో గాయపడిన అతనిని స్థానికులు 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీకి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా



- చంద్రబాబుకు లేఖ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్దకుమారుడు, ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలసుబ్రమణ్యం శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖను పంపించారు. ఆరు నెలలుగా ప్రజలు, అభిమానులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకుని వారి మనోభావాల ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఆయన రాజంపేట అసెంబ్లీకి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే ఇతను టీడీపీకి రాజీనామా చేయడం జిల్లాలో రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.

2024 ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీకి పోటీ

సుగవాసి బాలసుబ్రమణ్యం 1995 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి తెలుగు దేశం పార్టీకి, జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన సమయంలో ఆయన కొద్ది కాలం పాటు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. 2001లో మళ్లీ రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున రాజంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు.

ఓటమి తర్వాత పార్టీతో పెరిగిన దూరం

43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటున్న సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబానికి 2012 ఉప ఎన్నికల తర్వాత.. 2014, 2019 సాధారణ ఎన్నికల్లో పార్టీ టికెట్టు కేటాయించలేదు. 2024లో రాయచోటి అసెంబ్లీ టికెట్టును పాలకొండ్రాయుడు కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులు ఆశించారు. ఒకానొక దశలో రాజంపేట పార్లమెంటు స్థానానికి బాలసుబ్రమణ్యం పేరును పార్టీ ఖరారు చేస్తుందనుకున్నారు. అయితే రాజంపేట పార్లమెంటు టికెట్టును బీజేపీ తరపున మాజీ ముఖ్యమంత్రినల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించడంతో బాలసుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ సీటును కేటాయించారు. జిల్లాలో తప్పకుండా గెలుస్తుందనుకున్న సీట్లలో రాజంపేట పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే కొందరు నాయకులు తమ రాజకీయ మనుగడ కోసం బాలసుబ్రమణ్యం ఓటమికి కారకులయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ విషయమై గందరగోళం ఏర్పడింది. సాధారణంగా తెలుగుదేశం పార్టీ పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తుంది. అయితే ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోసం పలువురు నాయకుల మధ్య పోటీ నెలకొంది. పేరుకే బాలసుబ్రమణ్యంను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినప్పటికీ అతను చెప్పిన పనులు నియోజకవర్గంలో ఏమీ జరగలేదు. రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో సుమారు ఆరేడు నెలలుగా బాలసుబ్రమణ్యం, టీడీపీ అధిష్టానానికి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. పార్టీ కార్యక్రమాలకు సైతం బాలసుబ్రమణ్యం దూరంగా ఉంటూ వచ్చారు. గత నెలలో పాలకొండ్రాయుడు మృతి చెందారు. ఆయన కడసారి చూపు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తారని అందరూ ఊహించారు. ఆయన రాకపోవడంతో సుగవాసి కుటుంబానికి పార్టీలో ఏమాత్రం గౌరవం లేదనే అభిప్రాయం ఆయన వర్గీయుల్లో ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి బాలసుబ్రమణ్యం రాజీనామా చేశారు. ప్రస్తుతం ఈయన రాజీనామా వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

టీడీపీని వదలను..

తన సోదరుడు బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగత విషయం. సోషల్ మీడియా ద్వారానే ఆయన రాజీనామా విషయం నాకు తెలిసింది. నేను ఎటువంటి పరిస్థితుల్లోనూ టీడీపీని వదలను. కొందరు రాజకీయంగా మమ్ములను దెబ్బకొట్టారు.

- సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

నిత్యపూజ కోనలో పారిశుధ్య పనులు

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): నిత్యపూజకోనలో అపరిశుభ్రత, వసతుల లేమి సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎండోమెంట్‌శాఖ అధికారు లు స్పందించారు. శనివారం తాగునీటి గుండాల్లో పారిశుధ్య ప నులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ పంచలింగాల గుడి వద్ద నీటి గుండాల్లో ఉన్న ప్లాస్టిక్ వంటి పదార్థాలు తొలగించి బ్లీచింగ్ వేశామని, మహిళలు దుస్తులు మార్చుకునే గది నిర్మాణం విష యం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కాలిబాటకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగిం చామని తెలిపారు.

దశాబ్దం తరువాత నెరవేరిన కల

- రూ.4.15 కోట్లతో రోడ్లు ఏర్పాటు
- గ్రామీణ ప్రజలు, రైతుల హర్షం



కొండపేట చెరువుకట్టపై బీటీ రోడ్డు వేసేందుకు కంకర పరిచిన దృశ్యం



కైలాసగిరి కోనకు వెళ్లే దారిలో వేసిన రోడ్డు



బయనపల్లె, బలసింగాయపల్లె మధ్య తారురోడ్డు వేసేందుకు గ్రావెల్ వేసిన దృశ్యం

చెన్నూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దశాబ్దం తరువాత రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ప్రజలు, రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద 1.85 కోట్లు, నాబార్డు నిధుల కింద రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.4.15 కోట్లతో బయనపల్లె, బలసింగాయపల్లెలో సుమారు 20 కి.మీ మేర సిమెంటు రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేస్తున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల తరువాత మా కల నెరవేరుతోందని ప్రజలు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన కాలనీలకు మహర్దశ

బలసింగాయపల్లె గ్రామ పంచాయతీలో దౌలతాపురం ఎస్టీకాలనీ, రనామాపురం ఎస్టీకాలనీ, కైలాసగిరికోన ఎస్టీకాలనీలు కొండ దిగువన ఉండేవి. గతంలో ఈ కాలనీలకు సరైన దారి సౌకర్యం లేక మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బంది పడేవారు. ఇలాంటి పరిస్థితుల్లో సుమారు పదేళ్ల క్రితం పీఎంజీఎస్‌వై కింద అప్పట్లో రూ.కోటి 15 లక్షలతో సీసీరోడ్లు, బీటీ రోడ్డు మంజూరైనా కాలక్రమేణా ఆ దారి పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆ ప్రాంత ప్రజలతో పాటు ఆ దారిలో ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు నాబార్డు, పీఎంజీఎస్‌వై కింద రూ.4.15 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఆ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయిన సీసీరోడ్లు

దౌలతాపురం ఎస్టీకాలనీ నుంచి ఎస్‌రామాపురం కాలనీ మీదుగా కైలాసగిరికోన వరకు ప్రస్తుతం సీసీరోడ్లు పూర్తి చేశారు. సుమారు రెండున్నర కిలోమీటరు మేర సీసీరోడ్లు ఏర్పాటుతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. అలాగే కొండపేట చెరువుకట్టపై బీటీ రోడ్డుకు కంకర తోలి రోడ్డు వేసేందుకు సిద్ధం చేశారు. సుమారు కిలోమీటరు మేర ఈ రోడ్డు ఏర్పాటు కానుంది. అదేసమయంలో చెరువుకట్టపై బీటీ రోడ్డు ఎస్టీ రామాపురం కాలనీని కలిపే మధ్యలో కొండపేట చెరువు అలుగు పారేందుకు నాణ్యతతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అలాగే జాతీయ రహదారిలో దౌలతాపురం క్రాసింగ్ నుంచి చెక్కెర ఫ్యాక్టరీ వరకు, బయనపల్లె నుంచి బలసింగాయపల్లె వరకు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నిత్యం ఈదారిన తిరిగే వందలాది మంది రైతులు హర్షం వ్యక్తం చేస్తన్నారు.



చాలాకాలం తరవాత నెరవేరిన కల

కొండపేట చెరువు కట్టపై బీటీ రోడ్డు ఏర్పాటు కావడం సంతోషకరం. ఈరోడ్డు ఏర్పాటుతో గ్రామ ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆయకట్టు రైతులకు పంటల నూర్పిడి కాలంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- ఎం.మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, బయనపల్లె

రోడ్డు వెడల్పు చేస్తున్నారు

బయనపల్లె, బలసింగాయపల్లెల మధ్య ఉన్న బీటీ రోడ్డు దారుణంగా దెబ్బతిని రాకపోలకు ఇబ్బందగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తీరింది. ఇక రైతులు ప్రజలకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- ఓ.విజయభాస్కర్‌రెడ్డి, బలసింగాయపల్లె



ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ క్రికెట్ విజేత అనంతపురం



విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

కడప స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నెట్‌రన్‌రేట్ ప్రాతిపదికన అనంతపురం జట్టును నిర్వాహకులు ప్రకటించారు. అనంతపురం జట్టు ఆడిన 4 మ్యాచ్‌లకు గాను 3 మ్యాచ్‌లలో విజయం సాధించి ఒక్క మ్యాచ్ ఓడిపోయింది. దీంతో 12 పాయింట్లతో నెట్‌రన్‌రేట్ 1.768 సాధించి మిగతా జట్ల కన్నా మెరుగైన స్థితిలో నిలిచింది. ఇదిలా వుండగా నెల్లూరు, చిత్తూరు జట్లు సైతం ఆడిన నాలు గింటిలో మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి పాయింట్ల పరంగా 12 పాయింట్లు సాధించినప్పటికీ నెట్ రన్‌రేట్‌లో నెల్లూ రు జట్టు 1.05, చిత్తూరు జట్టు 0.610 సాధించాయి. ఈ క్రమంలో కడప జట్టు ఆడిన నాలుగింటిలో మూడు మ్యాచ్‌లలో ఓటమి పాలై ఒక్క మ్యాచ్‌లో గెలుపొంది 4 పాయింట్లు మాత్రమే సాధించింది. కాగా కర్నూలు జట్టు ఆడిన నాలుగు మ్యాచ్ లలో ఓడిపోయి చివరి స్థానంలో నిలిచింది. చివరి రోజైన శని వారం ఆడిన మ్యాచ్‌లలో కర్నూలు జట్టుపై చిత్తూరు గెలు పొందగా మరో మ్యాచ్‌లో కడప జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో ఆదివారం చిత్తూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి 44.4 ఓవర్లలో కేవలం 208 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాయిసూర్యతేజ 80 పరుగులు, యెగ్నేశ్వర్ 51 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ రెడ్డిప్రకాష్ 5 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు కేవలం 23.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో లోహిత్‌లక్ష్మీనారాయణ 86 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. మరో బ్యాట్స్‌మెన్ తేజారెడ్డి 62 పరుగులు చేసి జట్టును గెలిపించారు. అలాగే వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 35.2 ఓవర్లలో 151 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయింది. ఇందులో ఆయుబ్ 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 22.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో అర్జున్ టెండూల్కర్ 78 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు 6 వికెట్లతో గెలుపొందింది.





5 వికెట్లు సాధించిన రెడ్డి ప్రకాష్ (చిత్తూరు), 86 పరుగులు చేసిన లోహిత్ లక్ష్మీనారాయణ (చిత్తూరు)

తాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలి

- కేంద్ర జల్‌జీవన్ మిషన్ ప్రతినిధి మీను శుక్ల పాఠక్



అధికారుల సమావేశంలో మీనా శుక్లా పాఠక్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందేలా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని జల్ జీవన్ మిషన్ ప్రతినిధి మీను శుక్లా పాఠక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహాయంతో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పథకంపై కేంద్ర ప్రభుత్వం తరపున వచ్చిన ప్రతినిధులైన మీను శుక్ల పాఠక్, ఎస్పీ శెట్టి, (చీఫ్ ఇంజనీర్, హర్యానా) గ్రామీణ నీటి సరఫరా శాఖ, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పీడీ డ్వామా, పీడీ డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ అధికారి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా 3709 పనులు మంజూరయ్యారని, ఇందులో 2225 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని మొత్తం 44 మండలాల్లోని 6967 నివాసాల్లో నివసిస్తున్న 31 లక్షల 87 వేల 66 మందికి రెండు విడతల్లో గండికోట, వెలిగల్లు రిజర్వాయర్ల ద్వారా కరువు ప్రాంతాలకు తాగునీటిని అందించడం కోసం 2370 కోట్ల రూపాయలతో ఏప్రిల్ 2025లో ప్రారంభించబడిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు 2027 అక్టోబరు కల్లా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా భౌగోళిక స్వరూపం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందని, భూగర్భజలాలు ప్రజలందరికీ అందుబాటులో లేవని, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా అత్యంత అవసరమని కేంద్ర ప్రభుత్వ బృందానికి వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే పోలవరం-బనకచర్ల

- ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వెలిగొండ, తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, అన్నమయ్య, పింఛ, ఝురికోన లాంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేస్తే సస్యశ్యామలం అవుతుందని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిధులు లేని కారణంగా కొన్ని ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మరికొన్ని నత్తకు నడక నేర్పుతున్నాయన్నారు. ఈ నేపధ్యంలో రూ.81,900 కోట్లతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కోసం టెండర్లు పిలవాలని చంద్రబాబు ప్రభుత్వం తహతహలాడడం విడ్డూరమన్నారు. మొదటి దశలో పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు, రెండవ దశలో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లె రిజర్వాయర్ వరకు, మూడవ దశలో బొల్లాపల్లె రిజర్వాయర్ నుంచి బనకచర్ల వరకు అన్నారు. ఇందులో 50శాతం అంటే రూ.40,950 కోట్లు ప్రపంచ బ్యాంకు, తదితర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి అప్పు, 20 శాతం అంటే రూ.16,380 కోట్లు కాంట్రాక్టర్ ముందు భరించి తర్వాత రైతుల నుంచి రాబట్టుకో వాలట, 20శాతం కేంద్రం, 10శాతం రాష్ట్రం భరిస్తాయట అన్నారు. ఇప్పటి వరకు పర్యావరణ, అటవీ, వన్యప్రాణి సంర క్షణ శాఖ, కేంద్ర జల సంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, గోదావరి నది యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవన్నారు. అయినప్పటికీ టెండర్లు పిలవాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం విడ్డూరమన్నారు. ఈ తొందరంతా కమీషన్ల కక్కుర్తి కోసమే అని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు మరో కాళేశ్వరం అవుతుందన్నారు.

మామిడికాయల లారీ బోల్తా



రోడ్డుకు అడ్డంగా బోల్తాపడిన లారీ, అందులోని మామికాయల బాక్సులు

దువ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇడమడక చెక్‌పోస్టు వద్ద శనివారం లారీ అదుపు తప్పి బోల్తాపడింది. మామిడికాయల లోడుతో తిరుపతి నుంచి హర్యానా వెళుతున్న 12 టైర్లతో కూడిన లారీ అదుపు తప్పి రోడ్డుమీద పడింది. సంఘటనలో ఎటువంటి ప్రాణాపాయం జరుగలేదు. లారీలోని మామిడికాయల బాక్సులు చెల్లాచెదురుగా పడిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం జరిగింది.

పోలీసులు స్థానికులతో కలిసి లారీని, బాక్సులను తొలగించే ప్రయత్నం చేశారు. చాలాసేపు శ్రమించి బోల్తాపడిన వాహనాన్ని తొలగించారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు ధ్రువీకరించారు.

చీనీ చెట్ల నరికివేత కేసులో ముగ్గురి అరెస్టు

కొండాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎనమలచింతల గ్రామంలో గురువారం రాత్రి ప్రసాద్ అనే రైతుకు చెందిన 41 చీనీ చెట్ల నరికివేత కేసులో శనివారం ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదే గ్రామానికి చెందిన అంజి, రెడ్డిపల్లె నాగేశ్, రెడ్డిపల్లె నాగార్జున అనే ముగ్గురిని అరెస్టు చేసినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు.

classified ఆంధ్రజ్యోతి lines

UTI MUTUAL FUND

ప్రతినెల రూ.18,000 6 అద్భుత పథకాలు 60నెలలు @ Nearly రూ. 16,70,000 To రూ.17,80,000! పథకాల ROM OD కొరకు 98660 99827, 95152 88917

Aje-233991

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 237584

యూనిట్ కార్యాలయం

9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మాగిపోయి... రాలిపోతున్న మామిడి

- ధరలు లేక తోటలపై వదిలేస్తున్న రైతులు
- అడ్వాన్సులు ఇచ్చి.. ముందుకు రాని వ్యాపారులు
- ఎగుమతులు లేకపోవడంతోనే దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వాలు



గడ్డంవారిపల్లె గ్రామంలో రాలిపోయిన మామిడిపండ్లు



ధర లేక మామిడికాయల గోడౌన్ వద్ద నిరీక్షిస్తున్న రైతు వెంకటసుబ్బయ్య



మహదేవపల్లె గ్రామంలో ధరలు లేకపోవడంతో చెట్లపైనే నిలిచిపోయిన మామిడి కాయలు

చక్రాయపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అసలే అరొకొరగా కాసిన కాపు.. ఆపై ధరలు లేక మామిడి రైతులు దిగాలు చెందుతున్నారు. మామిడికాయలు అడిగే నాధుడు లేక చెట్లకే మాగిపోయి కింద రాలిపోతున్నాయి. ఒకవేళ రైతులు మామిడికాయలను గోడౌన్‌లకు తీసుకెళ్లినా మాకు వద్దు మహాప్రభో అంటున్నారు వ్యాపారులు. దీనికి ఎగుమతులు లేకపోవడమే కారణం. ఇప్పటికే రైతుల నుంచి కొనుగోలు చేసిన కాయలు గోడౌన్‌లలో మగ్గిపోతున్నాయని వాపోతున్నారు. దీంతో రైతులు మామిడికాయలను తోటల్లోనే వదిలివేయాల్సి దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..

మండలంలో ప్రధానమైన పంటల్లో మామిడి పంట ఒకటి. చక్రాయపేట మండలంలోని సురభి, చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లె,మహదేవపల్లె, గంగారపువాండ్లపల్లె, గొట్లమిట్ల, ఎర్రగుడి, కుప్పం, నెర్సుపల్లె తదితర ప్రాంతాలలో దాదాపు 2వేల హెక్టార్లలో మామిడి విరివిగా సాగుచేశారు. అలాగే వీరబల్లె, రామాపురం, వేంపల్లె, తలుపుల, ఎన్‌పీకుంట తదితర ప్రాంతాలలో మామిడి సాగుచేసిన రైతులు ధరలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పండించిన మామిడి కాయలను వ్యాపారులు సురభి గ్రామంలో ఏర్పాటు చేసిన గోడౌన్‌లకు తరలించి ఎగుమతి చేసి డబ్బులు సంపాదించేవారు. కానీ ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోవడంతో వ్యాపారులు మామిడి తోటలవైపు చూడటం లేదు. ఒకప్పుడు బెనిషీలాంటివి టన్ను రూ.50 వేల రూపాయలు పలికితే నేడు కనీసం టన్ను రూ.5వేలు కూడా అడిగేవాడు లేడు. రైతులే గోడౌన్‌లకు పోయి మా కాయలు తీసుకొస్తామంటే వ్యాపారులు వద్దంటే వద్దు అంటున్నారు. దీంతో రైతులు ఏమి చేయాలో అర్థంకాక తోటల్లో మామిడికాయలు కోయకపోవడంతో పూర్తిగా మాగిరాలిపోతున్నాయి. పంట సాగు కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే దిగుబడి వచ్చే సమ యంలో ఇలా ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు రూ.2 కోట్లు వ్యాపారం..

మండలంలో సురభి గ్రామంలో ఐదారు మామిడికాయల గోడౌన్‌లు ఉన్నాయి. ప్రతి ఏడాది మామిడి సీజన్‌లో గోడౌన్లలో రూ.30 నుంచి రూ.40 కోట్ల మేర వ్యాపారం జరిగేదని వ్యాపారులు చెబుతున్నారు. కానీ ఏడాది కేడాది ఎగుమతులు లేక ధరలు పడిపోవడంతో రూ.2కోట్ల వ్యాపారం కూడా జరగలేదని లబోదిబోమంటున్నారు. ఇక మామిడి కాయలను గోడౌన్లకు తీసుకువచ్చినా అడిగే నాధుడు లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. కనీసం రూ.5వేలతో వేసుకోమని రైతులు బతిమలాడుతున్న మాకు వద్దని వ్యాపారులు అంటున్నారని కుప్పగుట్టపల్లెకు చెందిన రైతు వెంకటసుబ్బయ్య కంటతడిపెట్టాడు.



అడ్వాన్స్ ఇచ్చి వదిలేశారు

నాకు 20 ఎకరాల మామిడితోట ఉంది. ధర లేని కారణంగా అడ్వాన్స్ ఇచ్చినా వ్యాపారులు రాలేదు. పంట సాగుచేయడానికి ఏడాదికి దాదాపు రూ.5లక్షల నుంచి రూ.6లక్షలు ఖర్చు అయ్యింది. మామిడి పంటకు ఇన్సూరెన్స్ కట్టాము. కానీ బీమా రాలేదు. ఇన్సూరెన్స్ వస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

-వి.రామకృష్ణారెడ్డి, తొట్టికాడపల్లె, చక్రాయపేట మండలం.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు


బక్రీద్ సందర్భంగా రాజంపేట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాజంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను రాజంపేట ప్రాంతంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమీపంలోని ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కూటమి నాయకులు హాజరై ముస్లింలతో పాటు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ హజరత్ ఇబ్రహీం ప్రవక్త త్యాగ నిరతికి గుర్తుగా బక్రీద్ పండుగను జరుపుకుంటున్నామన్నారు. ప్రార్థన అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె పెద్ద ఈద్గా, సిటీ కల్యాణమంపడం వద్ద ఉన్న ఈద్గా, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఉన్న ఈద్గా మైదానాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నందలూరులో..

నందలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ జామియా మసీదు ప్రాంగణంలో ఉన్న ఈద్గాలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు పేదలకు వివిధ రకాల దాన కార్యక్రమాలు చేపట్టారు.

పెనగలూరులో..

పెనగలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఈద్గా మైదానాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెనగలూరు హైస్కూల్ సమీపంలోని ఈద్గాలో, చెయ్యేటి ఒడ్డున ఉన్న పీరు బాబాబీ ఈద్గాలో, పొందలూరు, వడ్డిపల్లె సమీపంలోని ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానం చేశారు.

సిద్ధవటంలో..

సిద్ధవటం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినం సందర్భంగా శనివారం మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ శివారులోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ నేత సయ్యద్ జవహర్‌బాషా మాట్లాడుతూ త్యాగం, సహనం ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని, దేవుని దయతో ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

చిట్వేలిలో..

చిట్వేలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ వేడుకలను శనివారం చిట్వేలి ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గుంజనేరు సమీపం వద్ద ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తోటివారి పట్ల కరుణ, సహనం ప్రదర్శించాలని సందేశాన్ని మత గురువులు ఈద్గా వద్ద బోధించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


ఒంటిమిట్టలో..

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట, నరసన్నగారిపల్లె, రాచపల్లె, మంటపంపల్లె, కోనరాచపల్లె, సాలాబాదు గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఆయా ఈద్గాల వద్ద ముస్లింలకు బక్రీద్ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ముతవల్లి హమానుల్లా మాజీ కోఆప్షన్ మెంబరు షేక్ అజంతుల్లా, డాక్టర్ జిలాని బాషా, షేక్ మస్తాన్, తాజూర్, జాకీర్ హుస్సేన్, చాన్‌బాషా, బాబ్జి, కరిముల్లా, ఖాదర్, ముస్తఫా, ఇస్మాయిల్, పరీదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుల్లంపేట, అప్పయ్యరాజుపేట, మహబూబ్‌నగర్ కాలని, ఖాదర్‌పేట, దళవాయిపల్లె, కేతరాజుపల్లె శ్రీరాములమిట్ట గ్రామాల్లో ఈద్గా మైదానానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందూ సోదరులతో కలిసి విందు భోజనాలు చేశారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మత పెద్ద షకీల్ అహ్మద్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని రాజనగర్ వద్ద ఉన్న ఈద్గా స్థలంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఖురాన్‌ను పఠించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

త్యాగం, దానగుణాల ప్రతీక బక్రీద్ పండుగ

రాయచోటిటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ప్రతిబింపజేస్తుందని, ఈ పండుగ సమస్త మానవాళికి ఆదర్శనీయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు, టీడీపీ యువనాయకుడు నిశ్చల్‌నాగిరెడ్డి అన్నారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని పాతరాయచోటి సమీపంలో ఉన్న హజరత్ జమాలుల్లా ఈద్గాలో ముస్లింలు నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, జిల్లా మైనార్టీ కార్యదర్శి ఇర్షాద్‌అలీ ఖాన్, మైనార్టీ విభాగం పట్టణ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాజ్ కట్ట వద్ద బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు, మత పెద్దలు ఘనంగా బక్రీడ్ వేడుకలను నిర్వహించారు. సామూహికంగా మైనార్టీ సోదరులు, మత గురువులు, మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ త్యాగానికి, సహనానికి ప్రతీకా నిలిచే పండుగ బక్రీద్ అన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బక్రీద్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె-రెడ్డివారిపల్లె మధ్యలో ఉన్న ఈద్గా వద్ద, అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న ఈద్గాల వద్ద దిన్నెపాడు, దప్పేపల్లె, పందిళ్లపల్లి, మద్దిరేవుల గ్రామాల ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ముస్తాక్ అహ్మద్ అన్వర్ మహ్మద్ ప్రవక్త గురించి వివరించారు.

రామాపురంలో..

రామాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా చేసుకున్నారు. గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, ఉడుంవారిపల్లె, రామాపురం, హసనాపురం, పక్కీరుపల్లి, ఏకిలపల్లెల్లో ముస్లింలు శనివారం ఉదయం ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు సహనం, ఓర్పు, దాతృత్వానికి, త్యాగానికి ప్రతీకగా అల్లా తన శరీరంలోని మాంసాన్ని దానం చేశారని తెలిపారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొని స్నేహితులకు, బంధువులకు, పేదలకు మాంసాన్ని పంచిపెట్టారు.

గాలివీడులో..

గాలివీడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి, ఐక్యతకు ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల వ్యాప్తంగా ఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఇతరులకు దానాలు అందజేశారు. దైవప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ త్యాగానికి, విశ్వాసానికి, కరుణ ఐక్యతకు ప్రతీకగా బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని మసీదు పెద్దలు అన్నారు. మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమీపంలోని ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండుగ అంటేనే దాన గుణాలకు సంబంధించినదని, ఈ రోజు దానధర్మాలు చేస్తే అల్లా క్షమిస్తాడని వివరించారు. మండల వ్యాప్తంగా ముస్లింలు తమ ఈద్గాల్లో ప్రార్థనలు నిర్వహించారు.

వీరబల్లిలో..

వీరబల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా ముస్లింలు బక్రీద్ వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల సమీపంలో ఉన్న ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు కౌగిలించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రాయచోటిలో..

వైభవంగా కోదండరాముడికి స్నపన తిరుమంజనం


స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

ఒంటిమిట్ట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకశిలానగరం కోదండరామాలయంలో శనివారం ఉదయం స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామునే ఆలయ అర్చకులు మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ స్వామివారికి పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు తీసుకువచ్చారు. వీటితో స్వామివారికి అభిషేకం చేసి నూతన పట్టువస్త్రాలను ధరింపజేశారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో అంకాళమ్మ జాతర

రాజంపేట టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో శనివారం అంకాళమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం జాతర, అమ్మవారికి పొంగుబాళ్ల సమర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ జాతరకు నలుమూలల నుంచి భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుంటారు. జాతర సందర్భంగా జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా కోదండరాముడి గ్రామోత్సవం


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం ప్రాతఃకాల పూజలు, మూలమంత్ర జపాలు, యంత్ర విగ్రహాభిషేకం, వేదపారాయణం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, మహా స్నపనం(108 కలశాలతో), ధాన్యాదివాసం, శయ్యాదివాసం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం పూజలు, విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గంపా సుధాకర్ తెలిపారు.

మారెమ్మ ఆలయంలో అన్నదానం

నందలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లెలో కొలువైన మారెమ్మతల్లి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు దుర్గారెడ్డి, ధనుంజయనాయుడు, గోపాల్, అరిగె హరిబాబు, నారాయణ, మహేష్, పవన్‌కుమార్, దండు నాగేశ్వరరావు, సుబ్బనరసయ్య, వెంకటేశ్, బాబు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆటో సదుపాయం


చెక్కును అందిస్తున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బుడుగుంటపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల రాకపోకల కోసం ఆటో కొనుగోలుకు శనివారం టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి రూ.4,1500 చెక్కును అందించారు. ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు కోసం చెక్కును కళాశాల యాజమాన్యం, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి హాజరైన ముక్కా రూపానందరెడ్డి విద్యార్థినుల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించారని, ఆయన ఫౌండేషన్ నుంచి ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు కోసం డబ్బులు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు, శేఖర్, సుబ్బిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

పుల్లంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సూర్య నమస్కారాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని, అంతేకాకుండా శరీరంలో అనేక మార్పులు వస్తాయని ఉపాధ్యాయుడు రమణ అన్నారు. స్థానిక దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాలలో యోగాంధ్రలో భాగంగా శనివారం పిల్లలతో సూర్య నమస్కారాలు సాధన చేయించారు. సూర్య నమస్కారాలు యోగాలో ప్రధాన భాగమని, దీనివల్ల మానసిక ఒత్తిడి తగ్గి కండరాల మధ్య సమన్వయం పెరుగుతుందని, జనశక్తి పెరిగి ఎముకలు బలంగా తయారవుతాయన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు


డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్‌ను అభినందిస్తున్న ముక్కా రూపానందరెడ్డి, ముక్కా వరలక్ష్మి

రైల్వేకోడూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎర్రగుండ్ల జయప్రకాష్ ప్రమాణస్వీకారోత్సవానికి శనివారం రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డితో పాటు నాయకులు, కారకర్తలు కడపకు తరలివెళ్లారు. మంగంపేట తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జడల సతీష్, సవరం సాయినాథ్, బొప్పాయి వ్యాపారి శీలం బాలాజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పోకల మణి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిన గిరి, జనసేన గుగ్గిళ్ల సుబ్బరాయుడు, రైతు విభాగం అధ్యక్షుడు నాగినేని వెంకటరమణ, పెరుగు తుకారాం, పెరుగు జగదీష్, నాగభూషణం, చరణ్‌తేజ్, సాయి, నేలపాటి సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె టీడీపీ నేతల శుభాకాంక్షలు

సుండుపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా శనివారం కడపలో ప్రమాణ స్వీకారం చేసిన జయప్రకాశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు, మాజీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు రమేశ్‌నాయుడు, బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన చైర్మన్లకు ఘన సత్కారం

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండు జయప్రకాష్, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డిలను శనివారం టీడీపీ మండల నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో కృషి చేసిన జయప్రకాష్, సూర్యనారాయణరెడ్డికి పదవులు అలంకరించడం శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, మాజీ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నేత పుత్తా బాబు, తుర్రా ప్రతాప్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ముక్కావారిపల్లె వద్ద ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

రెడ్డి రాహిత్యకు అభినందనలు తెలిపిన చమర్తి


విద్యార్థిని రెడ్డి రాహిత్యను అభినందిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 596/600 మార్కులు సాధించి ప్రతిభా అవార్డుకు ఎంపికైన రాజు స్కూల్ విద్యార్థిని ఇండ్లూరి రెడ్డి రాహిత్యను కరస్పాండెంట్ చమర్తి జగన్‌మోహన్‌రాజు అభినందించారు. స్థానిక రాజు హైస్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ వి.మోహన్‌రెడ్డితో కలిసి రెడ్డి రాహిత్యకు ప్రశంసాపత్రం, షీల్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మక్కువతో విద్యనభ్యసించాలని సూచించారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు రావడం గర్వకారణంగా ఉందన్నారు. క్రమశిక్షణ కలిగిన విద్యను అందించడం తమ పాఠశాలల ప్రత్యేకత అని తెలిపారు.

మండల సమస్యలను పరిష్కరించాలి

ఒంటిమిట్ట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలానికి మంచి అధికారులను నియమించాలని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ మండల నాయకులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. కొమరా వెంకటనరసయ్య, నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బొడ్డే వెంకటరమణ, నాయకులు వినోద్‌రెడ్డి, బాలక్రిష్ణ, బొడ్డు రాయల్ రామక్రిష్ణయ్య శనివారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలి

పుల్లంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని, వెబ్ కౌన్సిలింగ్ వద్దని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల ఉమామహేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందు చెప్పిన విధంగానే ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఎస్టీయూ అధ్యక్షుడు సర్దార్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, జిల్లా కార్యదర్శి అవినాష్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం గ్రామ శివారులో మూలపల్లె క్రాస్ వద్ద శనివారం ఒంటిమిట్ట సీఐ బాబు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు రికార్డులు కలిగివుండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

రాయచోటిటౌన్, జూన్7(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణరెడ్డిని శనివారం అన్నమయ్య జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నేతలు కలిసి శాలువా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డిబాబు, రాష్ట్ర నేతలు ఆంజనేయరెడ్డి, ఆంజనేయులు, సంఘాల సీఈవోలు ప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రవిరెడ్డి, వీరబద్ర, రామకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.


డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎర్రగుండ్ల జయప్రకాష్‌ను అభినందిస్తున్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
రాజంపేట - A.C.O.: 99854 11312 రాయచోటి - A.C.O.: 63006 38887 రాయచోటి - S.R.: 99858 65573 రైల్వేకోడూరు - S.R.: 98854 12462 D.C.M. : 99854 11184




ప్రశాంత్‌నగర్, నీరుగట్టువారి పల్లెలో సచివాలయాలు నిర్వహిస్తున్న అద్దె భవనాలు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చే క్రమంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వార్డు, గ్రామ సచివాలయాలను పలు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అప్పట్లో కొన్ని సచివాలయాలకు భవనాలు నిర్మించినా, మరికొన్నింటి నిర్మాణాలు వివిధ కారణాలతో అర్ధాంతరంగా ఆగిపోయాయి.

బకాయిలు భరించలేం..

- అద్దెలు చెల్లించండి.. మహాప్రభో..!
- సచివాలయ భవన యజమానుల వేడుకోలు
- జిల్లాలో రూ.80 లక్షల మేర బకాయిలు

మదనపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాలతోపాటు, పట్టణ శివారు పంచాయతీలోని గ్రామాల్లో గ్రామ సచివాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా భవనాలకు సంబంధించిన అద్దెలు ప్రభుత్వం నెలనెలా సక్రమంగా చెల్లించక పోవడంతో భవన యజమా నులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకూ ఏడు నెలలు పూర్తి కాగా, ఎనిమిదో నెల కూడా ముగు స్తున్నా.. బాడుగ డబ్బులు రాకపోవడంతో కొందరు యజమానులు సచివాలయాలకు తాళం వేయడానికి సిద్ధమవుతున్నారు. రావాల్సిన డబ్బులు వచ్చినప్పుడు తీసుకుంటామని, ఆఫీసులు మాత్రం వెంటనే ఖాళీ చేయండని సచివాలయ ఉద్యోగులను ఆదేశిస్తున్నారు. మరికొందరేమో.. ఇప్పటి వరకూ రావాల్సిన బకాయిలు చెల్లించి టేబుల్, కుర్చీలు సర్దుకోండని సూచిస్తున్నారు. నాలుగేళ్లుగా అద్దెలు పెంచలేదని, అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఒకే మొత్తాన్ని చెల్లిస్తుండడం కూడా వారి ఆక్రోశం, ఆవేశానికి కారణంగా చెప్పవచ్చు. మున్సిపాలిటీ గదులు అయితే మాత్రం.. మూడేళ్లకో సారి రెన్యువల్ చేయడంతోపాటు 33 శాతం అద్దె పెంచి వసూలు చేస్తున్నారు కదా అని ప్రశ్నిస్తున్నారు. పైగా వ్యాపారులు, ఇతర వర్గాలు తీసుకున్న గదులకు ఏ నెలకు ఆ నెల బాడుగ చెల్లించ కుంటే సర్వీస్ చార్జీలతోపాటు, అపరాధ రుసుం వసూలు చేస్తున్నా రని, అది కూడా నెలలో అయిదో తేదీ లోపల చెల్లించకుంటే వడ్డీ వసూలు చేస్తున్నారంటున్నారు. ఇదే విషయాన్ని నిన్నటి మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యులు ప్రస్తావించారు. ఇలా ఎన్నిరోజులైనా ఎలా ఉంటారని ప్రశ్నించారు. జిల్లాలో మొత్తం 501 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 414, పట్టణ ప్రాంతాల్లో 87 సచివాలయాలుండగా, వీటిలో 82 గ్రామ, వార్డు సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటికి చదరపు గజం రూ.6 నుంచి రూ.10 చొప్పున భవనం విస్తీర్ణాన్ని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.15వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు బాడుగలు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు లేదా నాలుగు నెలలకోసారి, అది కూడా ఒక నెల మాత్రం చెల్లించి మిగిలిన మొత్తం బకాయి పెట్టింది. అదే ప్రవేటు వ్యక్తులకు బాడుగకు ఇస్తే.. అడ్వాన్సుతో పాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా అద్దె వచ్చేదని యజమానులు వాపోతున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా తీసుకుంటే ఎనిమిది నెలలుగా బాడుగలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.80 లక్షల మేర బకాయి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో 44 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో 23 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3 లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకూ ఏడు నెలలు పూర్తయి, మరో నెల కూడా ఆ జాబితాలో చేరనుంది. జిల్లా కేంద్రం రాయచోటిలో 25 వార్డు సచివాలయాలు ఉండగా, 22 కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి. రూ.12లక్షల మేర బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో 13 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో ఏడు సచివాలయాలు బాడుగ భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే జిల్లాలోని 30 మండలాల్లో మదనపల్లె డివిజన్‌లో ఏడు, రాయచోటి డివిజన్‌లో ఆరు, రాజంపేట డివిజన్‌లో పదిహేను చొప్పున మొత్తం 28 గ్రామ సచివాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. కాగా, సచివాలయ భవనాల అద్దెలను ఆయా భవనాల యజమానుల పేరున సీఎఫ్‌ఎంఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే, వారివారి ఖాతాలకు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం నీడలో.. చరిత్ర సాక్ష్యం



- ముళ్ల పొదల్లో భోగంరాణి బావి
- ఆదరణకు నోచుకోని అందమైన కట్టడం
- నవాబుల పాలనలో నిర్మాణం
- అభివృద్ధి చేస్తే పర్యాటకానికి ప్రోత్సాహం
- పట్టించుకోని పురావస్తు శాఖ

పాలకుల నిర్లక్ష్యం కారణంగా చరిత్రను కళ్ల ముందుంచే ప్రాచీనమైన కట్టడాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయనడానికి సిద్దవటం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భోగంరాణి బావి నిదర్శనంగా నిలుస్తోంది. శతాబ్దాలుగా ఆదరణ లేకపోవడంతో అతి సుందరమైన ఈ కట్టడం క్రమేణా శిథిలమైపోతోంది

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మట్లిరాజులు, సూర్యవంశ రాజులు పరిపాలించిన సిద్దవటం మండల కేంద్రానికి సమీపంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల మధ్యలో భోగంరాణి బావి అనే కట్టడం ఉంది. అప్పట్లో పాలకులు ఈ కట్టడాన్ని విడిదిగా వినియోగించేవారు. సిద్దవటం కోటను హకీంఖాన్ అనే వ్యక్తి పాలించే కాలంలో ఆయనకు ఒక ఉంపుడుగత్తె ఉండేది. తనకోసం ఒక సుందరమైన భవనాన్ని నిర్మించాలని ఆమె రాజును కోరగా, ఆయన సమ్మతించాడు. ఆమె కోరిక ప్రకారం భవనాన్ని నిర్మించాలంటే ఖర్చు చాలా అవుతుందని అప్పటి వడ్డెరలు హకీంఖాన్‌కు తెలపగా, ఆ మొత్తం ఆమే చెల్లిస్తుందని, పనులు ప్రారంభించమని ఆదేశించాడు. దీంతో ఒక తూముడు బంగారు నాణేలు ఇచ్చే ఒప్పందంపై వారు భవనాలను, బావిని నిర్మించారు. పనులు పూర్తయ్యాక తమకు ఇస్తామని చెప్పిన బంగారు నాణేలు ఇవ్వాలని వడ్డెరలు అడగగా, ఆమె ఒక గొడ్డలి తెచ్చి కట్టె తీసివేసి గొడ్డలికి ఉన్న రంధ్రం నిండుగా బంగారు నాణేలు వేసి తీసుకోమన్నదట. ఇది చాలా అన్యాయమని వడ్డెరలు ఆమెతో గొడవకు దిగినా ఆమె లెక్కచేయలేదట. దీంతో కోపగించిన వడ్డెరలు భవనం మధ్యలో బావిపై నిర్మించిన ఉయ్యాల ఊగుతూ, బావిలో పడి చస్తావని శాపం పెట్టారు. ఆ ప్రకారమే ఆమె ఒకరోజు ఉయ్యాలలో ఊగుతూ, బావిలో పడి మరణించిందట. అప్పటి నుంచి ఆ భవన సముదాయానికి భోగం రాణి బావి అని పేరు వచ్చింది. ఆమె కూడబెట్టిన సొమ్ము అంతా ఒక పెట్టెలో ఉంచి ఆ బావిలోనే దాచినట్లు ప్రచారం ఉంది. అత్యంత సుందరంగా నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పూడిపోయింది. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కొంతభాగం పైకప్పు ఉన్నా చాలావరకు మొండి గోడలే మిగిలిపోయాయి. ఎంత శిథిలమైనా ఇప్పటికీ చాలా అందంగా కనిపిస్తుందని స్థానికులు చెబుతుంటారు.

ఇప్పటికైనా పాలకులు, పర్యాటక శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న కట్టడాన్ని పరిరక్షించడంతోపాటు అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటు లోకి తేవాలని మండలవాసులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



పురావస్తుశాఖ అధికారులు స్పందించి భోగంరాణి బావిని అభివృద్ధి బాటలోకి తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే, పర్యాటకులను ఆకట్టుకునే అవకాశం ఉంది.

- నాగార్జున, ఎస్.రాజంపేట

పర్యాటకరంగానికి ఊతం



భోగంరాణి బావిని అభివృద్ధి చేసి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలి. దీంతో పర్యాటక రంగం ఊతం లభించడంతోపాటు, ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం కూడా వస్తుంది.

- సహదేవ్, ఎస్.రాజంపేట

నాటుసారా స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

వాల్మీకిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరితోపాటు, వారికి సరఫరా చేస్తున్న మరో వ్యక్తి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో స్థానిక సీఐ లత, ఎస్ఐ సుభాషిణి సిబ్బంది శనివారం వాల్మీకిపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న గుండ్లూరు గ్రామానికి చెందిన అల్తాఫ్‌బాషా (31), కిరణ్ కుమార్ (28)ను అరెస్టు చేసి వారి నుంచి 14 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసు కున్నారు. వీరికి నాటుసారా సరఫరా చేసిన క్రాంతి అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని ముగ్గురినీ రిమాండుకు తరలించారు.

అతిగా మద్యం తాగి యువకుడు మృతి



మృతి చెందిన యువకుడు

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ఓ యువకుడు మృతిచెందాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని యువకుడు మద్యం తాగి పుంగనూరు రోడ్డు పక్కన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని అరుగుపై పడుకున్నాడు. శనివారం తెల్లవారే సరికి అతను అరుగుపై నుంచి కింద పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అతను పాతసామాన్లు ఏరుకుని గుజిరీకి విక్రయించి జీవిస్తుంటాడని గుర్తించారు. మృతుని వివరాలు తెలిస్తే స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ వెంకరటమణ ఒక ప్రకటనలో తెలిపారు.

కారు బోల్తా - ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన కారు

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కారు బోల్తా పడడంతో ముగ్గురికి గాయా లయ్యాయి. నందలూరుకు చెందిన కొందరు శనివారం ఉదయం అనంతపురం నుంచి వస్తుండగా కడప - చెన్నై జాతీయ రహదారిలోని నిర్మలగిరి కాలనీ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయా ణిస్తున్న రామకృష్ణయ్య, కల్యాణి, ప్రశాంతి గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ప్రమాద సమయంలో కారులు ఐదుగురు పెద్దలు, నలుగురు పిల్లలు ఉన్నట్టు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. ఈ ప్రమాదంలో పెంచలయ్యకు చెందిన దుకాణం పాక్షికంగా దెబ్బతినింది.

ఆటో బోల్తా.. తొమ్మిది మందికి గాయాలు

మదనపల్లె టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో తొమ్మిది మంది గాయపడ్డారు. మండలంలోని తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్ శనివారం తన షేర్ ఆటోలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని ఆరోగ్యవరం బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఎర్రగన్నమిట్ట డౌన్‌లో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే యత్నంలో అదుపు చేయలేకపోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చంద్రశేఖర్, షాహీనా (30), హమీదా(35), మస్తాని(40), నాదిర్‌షా(25), యూసఫ్(5), ఆసియా(3), రుఖియా (13), మరియా(12) గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స చేయించుకుని బాధితులు ఇళ్లకు వెళ్లిపోయారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీకి చెందిన రామకృష్ణ కుమారుడు గంగాధర్(24) భవన నిర్మాణ కార్మికుడు. మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతో వివాహ సంబంధాలు రాలేదు. ఆరోగ్యం కుదుట పడ్డాక వివాహం చేస్తామని తల్లిదండ్రులు కూడా చెప్పడంతో మనస్తాపం చెంది విషం తాగాడు. కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన నరసింహులు భార్య ఎల్లమ్మ(65) ఆరేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతోంది, ఇటీవల అనారోగ్యం ఎక్కువ కావడంతో గన్నేరు కాయలు తినింది. మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

కనులపండువగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం




కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన భక్తులు

ములకలచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ముండలంలోని వేపూరికోట సమీపంలో శనివారం చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేపూరికోట, కుటాగులోళ్లపల్లె, పెద్దయ్యగారిపల్లె, వేపూరికోట క్రాస్, గురికివారిపల్లె, చీకుచెట్టుపల్లె, ఆర్‌ఎస్ కొత్తపల్లె, ఎర్రకాలువపల్లె, ఉమాశంకర్‌కాలనీ, ఆవులవారిపల్లె, ఎద్దులవారిపల్లె, పెద్దపల్లె, బంగారువాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, ఎస్సీ కాలనీల నుంచి భక్తులు తరలి వచ్చారు. పెళ్లి పెద్దలుగా నవీన్‌కుమార్, స్వర్ణ దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విద్యుత్‌దీపాలంకరణ, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధారెడ్డి, మాజీ ధర్మకర్త రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, లక్ష్మన్న, మూగి రవిచంద్ర, వేమారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటాద్రి, శేషారెడ్డి, పిడుగు రెడ్డెప్ప, భాస్కర్‌రెడ్డి, అశోక్ కుమార్, పుల్లారెడ్డి, చలపతి, జయరాంరెడ్డి, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మదనపల్లె టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అటవీ సంపద కొల్లకొట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం మాట్లాడుతూ ఉద్యమకారులను కేంద్ర ప్రభుత్వం అణగదొక్కడం దారుణమన్నారు. వ్యక్తులను అంతం చేసినంత మాత్రాన ఉద్యమాలు అంతం కావన్నారు. బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ కగార్‌పై హోంమంత్రి ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. పేద, బడుగులకు చేదోడుగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల కోసం పోరాడుతున్న వ్యక్తులను అంతం చేయడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను కూడా వారి బంధువులకు అప్పగించలేదన్నారు. ఈ సమావేశంలో ఏపీసీఎల్సీ నాయకుడు నాగేశ్వరరావు, న్యాయవాది సోమశేఖర్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి పాల్గొన్నారు.

తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా భవ్యశ్రీ



కుటుంబ సభ్యులతో భవ్యశ్రీ

కడప రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కడపకు చెందిన యువతి అతి పిన్న వయసులోనే తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక య్యారు. త్వరలో న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

తండ్రి ప్రోత్సాహంతో..

కడప నగరంలో నివాసం ఉంటున్న పసుపులేటి చంద్ర, మాధురీదేవి కుమార్తె భవ్యశ్రీ. పసుపులేటి చంద్ర ప్రస్తుతం అట్లూరు పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా తరచూ కోర్టుకు వెళ్లేవారు. ఆ సమయంలోనే తమ బిడ్డను న్యాయమూర్తిగా చూడాలనుకున్నారు. అందు లో భాగంగా భవ్యశ్రీకి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో క్లాట్ శిక్షణ ఇప్పించారు. ఇంటర్మీడియట్ పూర్తి కాగానే వైజాగ్‌లోని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీలో ఐదేళ్ల లా కోర్సులో చేర్పించారు. కోర్సు పూర్తయిన తరువాత 2023లో తెలంగాణ హైకోర్టులోను, 2024లో ఏపీ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2024లో తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలోను చక్కని ప్రతిభ చూపి 24 ఏళ్ల వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు.

న్యాయం వైపు నిలబడ్డమే ప్రధాన విధి

న్యాయం వైపు నిలవడమే ప్రధాన విధిగా భావిస్తా. తండ్రి కోరిక మేరకు లా చదివి జడ్జిని అయ్యాను. లా కాలేజీలో మంచి ఫౌండేషన్ ఏర్పడింది. జూనియర్ సివిల్ జడ్జి నోటిఫికేషన్ పడినప్పటి నుంచి సాధన చేశాను. సీనియర్ జడ్జిల సెమినార్లకు హాజరు కావడంతో పాటు, కోర్టుకు వెళుతూనే, ఎలాంటి కోచింగ్ లేకుండా రోజుకు 8 నుంచి 12 గంటలు శ్రమించాను. తొలి ప్రయత్నంలోనే జడ్జిగా ఎంపికయ్యా. చట్టాలకు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులకు లోబడి, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తా.

- పసుపులేటి భవ్యశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గాలివీడు, జూన్7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బాధ తాళలేక ఓ వ్యక్తి విషం తాగి న వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు... గోరాన్‌చెరువు గ్రామం మండివాండ్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన నచ్చుకూరి లక్ష్మయ్య (59)కు పదే పదే మూర్ఛ వ్యాధి వస్తుండటంతో మనస్తాపం చెందేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది జూన్ 1వ తేదీ పింఛన్ డబ్బులు తీసుకున్నాడు. సాయంత్రం 6 గంటల సమయంలో పొలం దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద స్పృహ తప్పిపడిపోయి కనిపించాడు. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ లక్ష్మయ్య శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పూజారికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుళారం చిన్నరాసిపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటి మాసా పేట గంగమ్మ దేవాలయ పూజారి చెంద్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం కాకుళారం గ్రామానికి వెళ్లి వస్తుండగా కొత్తరాసిపల్లె వద్ద స్కూటర్ ఢీకొని కింద పడ్డారు. దీంతో గాయపడిన అతనిని స్థానికులు 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీకి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజీనామా

- చంద్రబాబుకు లేఖ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్దకుమారుడు, ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలసుబ్రమణ్యం శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖను పంపించారు. ఆరు నెలలుగా ప్రజలు, అభిమానులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకుని వారి మనోభావాల ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఆయన రాజంపేట అసెంబ్లీకి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే ఇతను టీడీపీకి రాజీనామా చేయడం జిల్లాలో రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.

2024 ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీకి పోటీ

సుగవాసి బాలసుబ్రమణ్యం 1995 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి తెలుగుదేశం పార్టీకి, జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన సమయంలో ఆయన కొద్ది కాలం పాటు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. 2001లో మళ్లీ రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున రాజంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు.

ఓటమి తర్వాత పార్టీతో పెరిగిన దూరం

43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటున్న సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబానికి 2012 ఉప ఎన్నికల తర్వాత.. 2014, 2019 సాధారణ ఎన్నికల్లో పార్టీ టికెట్టు కేటాయించలేదు. 2024లో రాయచోటి అసెంబ్లీ టికెట్టును పాలకొండ్రాయుడు కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులు ఆశించారు. ఒకానొక దశలో రాజంపేట పార్లమెంటు స్థానానికి బాలసుబ్రమణ్యం పేరును పార్టీ ఖరారు చేస్తుందనుకున్నారు. అయితే రాజంపేట పార్లమెంటు టికెట్టును బీజేపీ తరఫున మాజీ ముఖ్యమంత్రినల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించడంతో బాలసుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ సీటును కేటాయించారు. జిల్లాలో తప్పకుండా గెలుస్తుందనుకున్న సీట్లలో రాజంపేట పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే కొందరు నాయకులు తమ రాజకీయ మనుగడ కోసం బాలసుబ్రమణ్యం ఓటమికి కారకులయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ విషయమై గందరగోళం ఏర్పడింది. సాధారణంగా తెలుగుదేశం పార్టీ పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తుంది. అయితే ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోసం పలువురు నాయకుల మధ్య పోటీ నెలకొంది. పేరుకే బాలసుబ్రమణ్యంను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినప్పటికీ అతను చెప్పిన పనులు నియోజకవర్గంలో ఏమీ జరగలేదు. రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో సుమారు ఆరేడు నెలలుగా బాలసుబ్రమణ్యం, టీడీపీ అధిష్ఠానానికి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. పార్టీ కార్యక్రమాలకు సైతం బాలసుబ్రమణ్యం దూరంగా ఉంటూ వచ్చారు. గత నెలలో పాలకొండ్రాయుడు మృతి చెందారు. ఆయన కడసారి చూపు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తారని అందరూ ఊహించారు. ఆయన రాకపోవడంతో సుగవాసి కుటుంబానికి పార్టీలో ఏమాత్రం గౌరవం లేదనే అభిప్రాయం ఆయన వర్గీయుల్లో ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి బాలసుబ్రమణ్యం రాజీనామా చేశారు. ప్రస్తుతం ఈయన రాజీనామా వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

టీడీపీని వదలను..

తన సోదరుడు బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగత విషయం. సోషల్ మీడియా ద్వారానే ఆయన రాజీనామా విషయం నాకు తెలిసింది. నేను ఎటువంటి పరిస్థితుల్లోనూ టీడీపీని వదలను. కొందరు రాజకీయంగా మమ్ములను దెబ్బకొట్టారు.

- సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

నిత్యపూజ కోనలో పారిశుధ్య పనులు

సిద్దవటం, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): నిత్యపూజకోనలో అపరిశుభ్రత, వసతుల లేమి సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎండోమెంట్‌శాఖ అధికారు లు స్పందించారు. శనివారం తాగునీటి గుండాల్లో పారిశుధ్య ప నులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ పంచలింగాల గుడి వద్ద నీటి గుండాల్లో ఉన్న ప్లాస్టిక్ వంటి పదార్థాలు తొలగించి బ్లీచింగ్ వేశామని, మహిళలు దుస్తులు మార్చుకునే గది నిర్మాణం విష యం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కాలిబాటకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగిం చామని తెలిపారు.

అంత్యక్రియలు



కీ॥శే॥ శ్రీ పి. ముత్తు స్వామి గారు

శేఖర్ స్వీట్స్, మదనపల్లి

జననం : 19-08-1947 **మరణం : 06-06-2025**

ప్రేమానురాగాలకు ప్రతిరూపంగా, మంచితనానికి మారుపేరుగా నిలిచి
తన అరుదైన వ్యక్తిత్వంతో మన అందరిలో చెరగని ముద్ర వేసి,
మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన

మానాన్న గారు కీ॥శే॥ శ్రీ పి. ముత్తు స్వామి గారు
06-06-2025 శుక్రవారం పరమపదించినారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

అంత్యక్రియలు

తేది : 08-06-2025, ఆదివారం ఉదయం 9-00 గంటలకు మదనపల్లి టౌన్, రోజా ప్లాట్స్, మా స్వగృహం నుండి బయలుదేరి గారబురుజు నందు అంత్యక్రియలు జరుగును.

ఇట్లు : బంధుమిత్రులు మరియు కుటుంబసభ్యులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

● ఈద్గాహ్‌లలో పండుగ నమాజు ఆచరించిన ముస్లింలు ● ర్యాలీగా ఈద్గాహ్‌కు తరలిన ముస్లింలు

మహోన్నత త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మతగురువులు వివరించారు. శనివారం పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లోని ముస్లింలు బక్రీద్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. కొత్త దుస్తులు ధరించి ఈద్గాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రార్థనలు చేశారు. స్వార్థాన్ని విడిచి సన్మార్గం వైపు నడవాలని, దయ, కరుణ, దాతృత్వం తదితర సుగుణాలను అలవర్చుకుని ఎదుటి వారికి సాయపడాలని బోధించారు. అనంతరం ఈద్గాహ్ నుంచి ఖబరస్థాన్‌లకు చేరుకుని పూర్వీకుల సమాధుల వద్ద నివాళులర్పించారు. ఖుర్బానీ ప్రక్రియలో భాగంగా పూర్వీకుల పేరిట ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని బంధువులు, పేదలకు పంచిపెట్టారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. వివరాల్లోకెళితే....




బి.కొత్తకోట ఈద్గాలో నమాజ్‌చేస్తున్న ముస్లింలు - వాల్మీకిపురం ఈద్గా వద్ద బోధిస్తున్న మత గురువు




ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా - కలకడలో శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

పీలేరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మహోన్నత త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను శనివారం మండలంలోని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. ఉదయం 8 గంటలకు ఊరేగింపుగా మదనపల్లె మార్గంలోని ఈద్గాహ్‌కు చేరుకుని ముఫ్తీ అబ్దుల్లా ధార్మిక ఉపన్యాసం, ఆధ్యాత్మిక విషయాలను విని నమాజు చేశారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్ తమ సిబ్బందితో పటిష్ట చర్యలు చేపట్టారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో 'మేము సైతం' ఫౌండేషన్ సభ్యులు శీతల పానీయాలు అందించారు. పీలేరు సహా తలపుల, రేగళ్లు, బోడుమల్లువారిపల్లె, ఆరంవారిపల్లె, శివరామాపురం గ్రామాల్లోనూ నమాజు ఆచరించారు.

● **గుర్రంకొండ:** మండలంలోని ముస్లింలు బక్రీద్ వేడుకలను చేసుకున్నారు. అనంతరం ఈద్గాల వద్ద గురువుల బోధనలు ఆలకించి పండుగ శుభాకాంక్షలను ప్రకటించుకున్నారు.

● **కలకడ:** మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. కలకడ, ఎర్రయ్యగారిపల్లె, పాపిరెడ్డిగారిపల్లె, ఎర్రకోటపల్లె, కోన, బంగారు వాండ్లపల్లె గ్రామాల్లో ఈద్గాలో ప్రార్థనలు చేశారు.

● **వాల్మీకిపురం:** మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. నమాజ్‌కట్టవీధి, బైపాస్ రోడ్డులోని ఈద్గాల వద్దకు ముస్లింలు ప్రదర్శనగా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం స్థానిక దర్గాలో చాదర్లు సమర్పణ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లె, మంచూరు తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు, నిరుపేదలకు దాన ధర్మాది కార్యక్రమాలు చేపట్టారు.

● **మదనపల్లె టౌన్:** త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని షోయబ్ పేర్కొన్నారు. మదనపల్లె జామియా మసీదు నుంచి ముస్లింలు బెంగళూరు రోడ్డులోని ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొని, ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటచలపతి డ్రైవర్స్‌కాలనీలోని ఈద్గా వద్ద పాల్గొన్నారు.

● **ములకలచెరువు:** మండలంలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ములకలచెరువు, బురకాయలకోట, దేవళచెరువు, కాలువపల్లె, చౌడసముద్రం, సోంపల్లె, కదరినాధునికోట తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్థనలు జరిపారు.

● **పెద్దమండ్యం:** మండలంలో బక్రీద్ పండుగ వేడుకగా జరిగింది. ముస్లింలు సమీప ఈద్గాల వద్ద నమాజ్‌లు చేశారు. పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి, పాపేపల్లి, గురివిరెడ్డిగారిపల్లి, గుడిసెవారిపల్లి, పి. తురకపల్లి, ముసలికుంట, బండ్రేవు, శివపురం, సిద్దవరం, రెడ్డివారిపల్లి, ముసలికుంట గ్రామాల్లో బక్రీద్ వేడుకలు జరిగాయి. మత పెద్దలు, హజరత్‌లు, ముత్తవల్లీలు పాల్గొన్నారు.

● **నిమ్మనపల్లె:** మండలంలోని ముస్లింలు బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో చేసుకున్నారు. సైదాపేట, సింగంవారిపల్లి, చల్లావారిపల్లి, నిమ్మనపల్లి, పిట్టావాండ్లపల్లి తదితర ప్రాంతాల్లో ఈద్గా వద్దకు చేరి ముతవల్లిల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **కురబలకోట:** త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను చేసుకుంటున్నామని మతగురువు మహమ్మద్ రఫి పేర్కొన్నారు. అంగళ్లు, కురబలకోట, ముదివేడు, సాహెబులవారిపల్లె, చేనేతనగర్, మొలకవారిపల్లె, నందిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగ చేసుకున్నారు. హబీబుల్లా, సనావుల్లా, ఖలీల్, అయూబ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

● **పెద్దతిప్పసముద్రం:** మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగ నిర్వహించుకున్నారు. ముస్లింలు ఆయా గ్రామాల ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీటీఎం సహా రంగసముద్రం, వినకర్రవాండ్లపల్లె, మద్దయ్యగారిపల్లె, కందుకూరు, మల్లెల, చెన్నరాయునిపల్లె, పులికల్లు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను చేసుకున్నారు.

● **రామసముద్రం:** మండల కేంద్రం, మండల పరిధిలోని చెంబకూరులో శనివారం బక్రీద్ పండుగ చేసుకున్నారు. ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దిగువపేట నుంచి ముస్లింలు ర్యాలీగా వెళ్లి ఎగువ చెక్‌పోస్టు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బకీద్ర్ వేడుకలకు ఎస్ఐ రవికుమార్, సిబ్బంది కిరణ్‌కుమార్, లోకేష్, కిరణ్‌యాదవ్ బందోబస్తు నిర్వహించారు.

● **తంబళ్లపల్లె:** త్యాగానికి ప్రతీకగా చేసుకునే బక్రీద్ పండుగను తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా ముస్లింలు నిర్వహించుకున్నారు. ముస్లింలు పెద్ద మసీదు నుంచి ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు చేశారు.

● **బి.కొత్తకోట:** ముస్లింలు పవిత్రంగా భావించే ఈద్-ఉల్-అధా(బక్రీద్) పర్వదినాన్ని మండలంలో ఘనంగా చేసుకున్నారు. పట్టణంలోని ప్రధాన ఈద్గా సహా గట్టు, గోళ్లపల్లి, తుమ్మణంగుట్ట, బడికాయలపల్లి తదితర గ్రామాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి, సీఐ జీవన్ గంగనాథ్ బాబు పట్టణ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

శేఖర్ స్వీట్స్ అధినేత ముత్తుస్వామి మృతి



మదనపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శేఖర్ స్వీట్స్ స్టాల్ అధినేత ముత్తుస్వా మి(72) మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి మృతిచెందారు. తమిళనాడుకు చెందిన ముత్తుస్వామి కుటుంబం నాలుగు దశాబ్దాల కిందట పట్టణానికి విచ్చే సి, స్థానికంగా చిన్నపాటి స్వీట్ దుకాణం ప్రారంభించారు. అనంతరం అంచలంచెలుగా ఎదిగి స్వీట్స్ వ్యాపారంలో మంచిపేరు సాధించి, పట్టణంలో రెండు దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఏడాది కిందట ముత్తుస్వామి భార్య మృతి చెందగా, అప్పటి నుంచి ఆయ న ఆరోగ్యం క్రమంగా క్షీణించినట్లు చెబుతున్నారు. ఈయనకు ఒక కుమారుడు ఉన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన నేతలు



మంత్రి సత్యకుమార్‌తో స్థానిక నేతలు

వాల్మీకిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌ను శనివారం విజయవాడలో టీడీపీ, బీజేపీ నేతలు కలిశారు. రాష్ట్ర కురబ కార్పొ రేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్‌రెడ్డి మంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. గతంలో 100పడకల ఆస్పత్రిగా వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి మంజూరు కాగా కేవలం 50పడకలకే కుదించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పిల్ల స్వామినాయక్, బీసీ నేత రాజగోపాల్, తదితరులున్నారు.

ది సిటిజన్ కో-ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్

హెడ్ ఆఫీస్: 11-7-194, హుడా కాలనీ, సరూర్ నగర్, హైదరాబాద్- 500 035
ఫోన్ నెం. 040- 23460120, 23460122, Fax: 040-23460121
website: www.citizensociety.co.in

బంగారు ఆభరణముల బహిరంగ వేలము

బంగారు ఆభరణములపై మా మదనపల్లి శాఖ ద్వారా 31-03-2024కు ముందు ఋణము తీసుకుని బకాయి పడిన వారు సొసైటీలో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణముల బహిరంగ వేలాన్ని ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే ప్రాతిపదిక మీద 13-06-2025 శుక్రవారం మధ్యాహ్నం 03-30 గంటలకు మా మదనపల్లి శాఖ ఆవరణంలో నిర్వహించుటకు నిశ్చయించబడినది. అట్టి ఖాతాల వివరములు మా శాఖ నోటీసు బోర్డుయందు మరియు www.citizensociety.co.in వెబ్‌సైట్ నందు పొందుపరచబడినది.

ఆసక్తి కలవారు రూ.5000/- డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చును. ఎలాంటి నోటీసు లేకుండా వేలం రద్దు లేదా వాయిదా వేయుటకు సొసైటీకి హక్కు గలదు. పాట దారుల ఏ ఆఫరునైనా అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు సొసైటీకి హక్కు కలదు.

ఇతర వివరాలకు మదనపల్లి శాఖ ఫోన్: 9100144470ను సంప్రదించగలరు / శాఖాధికారి

రైతులు సొంతంగా మార్కెటింగ్ చేసుకోవాలి



సీతాఫలం తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నిమ్మనపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టమోట తదితర పంటలకు మార్కెట్‌లో డిమాండ్ లేకుంటే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి రైతులు సొంతంగా మార్కెటింగ్ చేసుకుని లాభాలు పొందవచ్చని కలికిరి కృషి విజ్ఞాన సంస్థ సమన్వయకర్త మంజుల పేర్కొన్నారు. శనివారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి, గుర్రెడ్డిగారిపల్లిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో కొమ్మిరెడ్డిగారిపల్లిలో సీతాఫలం, జామ, మామిడి తోటలను పరిశీలించారు. శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసిన భూముల్లో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకే ఎరువులు వాడాలన్నారు. మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి పూత, పిందె సమయంలో కాకుండా మామూలు సమయంలో కూడా వుంటుందని జామ పంటలో ఎక్కువగా ఉండే పిండినల్లి నివారణకు సూచనలు అందజేశారు. కృషి విజ్ఞాన సంస్థ కలికిరిలో రైతులకు వరి వేరుశనగ, తృణ ధాన్యాల రకాలు అందుబాటులో వుంటాయని కావలసిన రైతులు తీసుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త మాధురి మాట్లాడుతూ టమోట టమాట, ఉద్యాన పంటల్లో సూక్ష్మపోషకాలను పిచికారీ చేస్తే పంట నాణ్యత ఎదుగుదల వుంటుందని తెలిపారు. ట్రైకోడర్మా మందును పిచికారీ చేయడంతో టమోట, ఇతర పంటలకు నేల ద్వారా సోకే సూక్ష్మక్రిములు నశిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త స్వరాజ్యలక్ష్మి వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, కృష్ణవేణి, నాయక్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం

పీలేరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు సీఎం నారా చంద్రబాబు సముచిత స్థానం కల్పించారని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఈడిగ సాధికార సమితి అధ్యక్షుడు బుస్సా నాగరాజ గౌడ్ తెలిపారు. ఇటీవల పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పురం రామ్మూర్తిని శనివారం ఈడిగ సాధికార సమితి సన్మానించింది. ఆయన మాట్లాడుతూ ఆది నుంచి టీడీపీని నమ్ముకుని పార్టీలో పయనిస్తున్న బడుగు, బలహీన వర్గాలకు పార్టీలో మంచి గుర్తింపు లభించిందన్నారు. చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు యాలపల్లి దీనదయాల్, యువ సేన ప్రధాన కార్యదర్శి వేపాకుల మురళీగౌడ్, తుమ్మల నాగరాజగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం

పెద్దతిప్పసముద్రం జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో నరసింహస్వామికి పుష్పయాగం వేడుకగా నిర్వహించారు. సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర వేద పండితులు మణికంఠస్వామిచే నరసింహస్వామి ఉత్సవ విగ్రహానికి 40 రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ఉచిత మెగావైద్య శిబిరం

బి.కొత్తకోట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక చైతన్య స్కూల్‌లో నేటి నుంచి రెండురోజులు ఉచితమెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవత స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులు క్రిష్టారెడ్డి, రామచంద్రారెడ్డి తెలిపారు. ఆక్సిన్‌స్పార్క్‌ల్యాబ్ ఆధ్వర్యంలో రామస్వామి హృదయాలయ, అగర్వాల్ దృష్టి ఐ హాస్పిటల్స్ డాక్టర్ చంద్రశేఖర్, వంశీధర్‌రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

సింహవాహనంపై బోయకొండ గంగమ్మ



వాల్మీకిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సింహవాహనంపై బోయకొండ గంగమ్మ నగరోత్సవంలో విహరించారు. యకొండగంగమ్మ అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవాలు మూడురోజులుగా వేడుకగా సాగాయి. శుక్రవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహం బాణాసంచా, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పురవీధుల్లో సింహవానంపై అమ్మవారు విహరించారు. శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేషాలంకరణలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో వేదపండితులు కృష్ణప్రసాద్ భట్టర్, అర్చక బృందం, ఆలయ కమిటీ సభ్యులు, యువత, భక్తులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం

మహిళా సంఘ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. ఇందు కోసం పట్టణ ప్రాంతంలో ఈ ఆర్థిక ఏడాదికి 30వేల మందిని స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో శనివారం సాయంత్రం మహిళాసంఘాలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మెప్మా సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వారితో కలసి డిజి లక్ష్మి ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలోని 123 యూఎల్‌బీలలో ఉన్న ప్రతి స్వయం సహాయక సంఘానికి కామన్ సర్వీసెస్ సెంటర్‌ను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విధివిధానాలను పీఆర్‌పీ మధుసూదన్‌రెడ్డితో కలసి సభ్యులకు వివరించారు.

కుమ్మరవాండ్లపల్లెలో తీరిన మంచినీటి సమస్య



బోరుకు డ్రిల్ చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మద్దయ్యగారిపల్లె పంచాయతీ కుమ్మరవాండ్లపల్లె వాసులకు మంచినీటి సమస్య తీరినట్లైంది. మూడు నెలలుగా గ్రామస్తులు మంచి నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కుమ్మరవాండ్లపల్లెలో కొత్తగా బోరు డ్రిల్ చేయడంతో నీరు పుష్కలంగా పడ్డాయి. మంచినీటి సమస్య తీరినట్లేనని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తీవ్రంగా మంచినీటి సమస్యతో బాధ పడ్డామని ఎన్నో సార్లు అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకునే వారు కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంచినీటి సమస్యపై తక్షణం చర్యలు చేపడుతోందన్నారు. సర్పంచ్ రామాంజులు, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, ఓబులేసు, బాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ బోరు చంద్ర పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, CHAVALI SOUJANYA W/o PANDARAM KISHORE KUMAR R/o, D.No: 09-109/50, Srilakshmi nagar Colony, Daminedu, Tirupati Town & Dist., A.P. I have Changed my Name to PANDARAM SOWJANYA. Hence forth I will be known as PANDARAM SOWJANYA W/o PANDARAM KISHORE KUMAR.

AJT-1305

CHANGE OF SURNAME

I, Kandra Mohana Kumari W/o K.Nethaji (Old Name), D.No.1-16, Achamma Agraharam(V), Pakala (M), Tirupathi Dist., A.P. India, I have Changed my Name. BOLLINENI MOHANA KUMARI (NEW NAME) W/o K.NETHAJI. Henceforth, I will be known as BOLLINENI MOHANA KUMARI (New Name) W/o K.NETHAJI.

AJT-1304

కావలెను

మేనేజర్ మరియు సిబ్బంది కావలెను. చిత్తూరులో నూతనంగా ప్రారంభించిన కైలాసధామం మహాప్రస్థానం (స్మశాన వాటిక) నందు పనిచేయుటకు కావలెను. అర్హత, అనుభవం గల వారికి ప్రాధాన్యత. సంప్ర : 94405 59492

AJT - 4622

FLATS FOR SALE

తిరుపతి తాటితోపు దగ్గర జీవోస్ కాలనీలో అపార్ట్‌మెంట్ నందు 1750Sftలతో తూర్పు ముఖం గల 3BHK ఫ్లాట్లు అమ్మకానికి కలదు. సంప్ర : 96523 24139

AJT -305

WANTED

అమరావతిలో పనిచేయుటకు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ నందు మేనేజ్‌మెంట్ సూపర్‌వైజర్ పురుషులు కావలెను. హిందీ, తెలుగు భాష తప్పనిసరిగా వచ్చి వుండాలి. ఎయిర్ బైపాస్ రోడ్డు. ఆకర్షణీయమైన జీతం. సంప్ర.: 97031 44467/68.

AJT - 239872

PLOTS FOR SALE

IIT తిరుపతి దగ్గరలో ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు ఎర్రచందనం చెట్లతో రిజిస్ట్రేషన్ చేయబడును. డైరెక్ట్ ఓనర్. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 95027 74175/79959 92114.

AJT -1298

CHANGE OF NAME

I, ASHRAFF, W/o SYED NOOR MOHAMMED, R/of DNo.2-250-20-B-C-3, Ramireddy Layout, Neeru - gattuvaripalle, H/o BK palle, Madanapalle T&M, Annamaiah Dist, AP. I have changed my name from ASHRAFF (Old Name), W/o SYED NOOR MOHAMMED to SYED ASHRAFF (New Name).

AJT-1287

FLATS FOR SALE

తిరుపతి పోస్టల్ కాలనీ 5వ క్రాసులో గల అపార్ట్‌మెంట్‌లో 1370,1700Sft లతో తూర్పు పడమర ముఖం గల 2BHK, 3BHK ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర: 96665 65762

AJT -304

PLOTS FOR SALE

తిరుపతి రేణిగుంట ఇంటర్నేషనల్ Airport ఎలక్ట్రానిక్స్ సిటీ ప్రక్కన సిగ్నేచర్ గార్డెన్స్ ఎదురుగా తుడా ఫైనల్ అప్రూవడ్ సెమి కమర్షియల్ ప్లాట్స్ అమ్మబడును నేరుగా సంప్ర :8096783848

AJT -1297

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 237584

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మోహినీ అలంకారంలో గజవాహనంపై నరసింహస్వామి



కలికిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి పురాతన ఆలయ బ్రహోత్సవాల సందర్భంగా ఆరో రోజు స్వామి వారు మోహినీ అలంకారంలో గజవాహనంపై విహరించారు. స్వామి వారికి తిరుమంజనం అనంతరం ఆలయంలో పల్లకీ సేవ జరిపారు. నిత్య నైవేద్యాలు, అర్చనాభిషేకాలు అనంతరం ప్రత్యేక అలంకారాల్లో నరసింహస్వామి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి మోహినీ అలంకారంలో స్వామివారు గజవాహనంపై పురవీధుల్లో విహరించారు. స్వామివారి విహారాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆసక్తి ప్రదర్శించారు. ప్రధాన అర్చకుడు మురళీధర ఆచార్య వివిధ కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

తరిగొండ నృసింహుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో అలంకరించి పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలు చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూలస్థానమ్మ జాతరకు భారీ బందోబస్తు



మూలస్థానమ్మ అమ్మవారు

కలికిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గుండ్లూరులో మూలస్థానమ్మ జాతరకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇదే సమయంలో గుట్టపాలెంలో స్థానిక అమ్మవారి జాతర కూడా ప్రారంభం కానుంది. జాతరలో ముగ్గురు ఎస్ఐలు, 80 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలికిరి ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆయా గ్రామాల్లో జాతర నిర్వాహకులు, స్థానికులతో చర్చలు జరిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటికి జాతర నిర్వాహకులే బాధ్యతవహించాల్సి వుంటుందని సీఐ స్పష్టం చేశారు. జాతరలో జూదం, డీజే డ్యాన్సులను అనుమతించేది కూడా లేదని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేడుకగా జాతర చేసుకోవాలని సీఐ సూచించారు. కాగా మూలస్థానమ్మ జాతర శనివారం రాత్రి సిద్దపూజ, జాగారం, బయనేని వారిచే మూలస్థానమ్మ హరికథ నిర్వహిస్తారు. ఆదివారం సాయంకాలం దివ్వెలు, బోనాలు, రాత్రికి చాందినీ బండ్లు, చెక్క భజనలు, పిల్లనగ్రోవి కోలాటలతో వేడుకగా జరుగనుంది. ఆది, సోమవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కుబడులు తీర్చుకుంటారు. సోమవారం రాత్రి పుష్ప పల్లకి సేవ తరువాత అమ్మవారి ఊరేగింపుతో గ్రామోత్సం నిర్వహించనున్నారు.

